www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4  సంచిక -160  గురువారం 24 సెప్టెంబర్ 2026  ఎడిటర్ : మారేపల్లి అశోక్  పేజిలు 8  వెల - 3/-  01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# విద్యుదుత్పత్తి ఆగడానికి వీల్లేదు

## ఎత్తిపోతలకు ఆటంకాల్లేకుండా విద్యుత్తు

**సాగు అవసరాలకూ నిరాటంకంగా సరఫరా**

**దసరాలోపు 'యాదాద్రి'లో పూర్తిస్థాయి ఉత్పత్తి**

**రాష్ట్రంలో జీ-9 రకం బొగ్గు లభించనప్పుడు ఆ సాంకేతికతతో యాదాద్రి పవర్ ప్లాంట్‌ను ఎందుకు డిజైన్ చేసినట్టు?**

**మహానది కోల్‌ఫీల్డ్ నుంచి బొగ్గు కొనుగోలు, లింకేజీ కోసం కేంద్రంతో చర్చలు జరపండి**

**విద్యుత్తుశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్**



**హైదరాబాద్, సెప్టెంబరు 23 (ప్రజావినికిడి):**
ప్రస్తుతం రాష్ట్ర అవసరాలకు తగినట్లుగా విద్యుత్తును కొనుగోలు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎత్తిపోతల పథకాలకు ఎలాంటి ఆటంకం లేకుండా విద్యుత్తు సరఫరా చేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయానికి అందిస్తున్న విద్యుతు సరఫరాలోనూ ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని నొక్కి చెప్పారు. బొగ్గు కొరత కారణంగా రాష్ట్రంలో విద్యుదుత్పత్తి ఆగడానికి వీల్లేదని, బయట నుంచి బొగ్గు కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని పవర్ ప్లాంట్లలో పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తికి మిగతా 2లో...

# ఎనిమిదేళ్ల ఆయుష్మాన్ భారత్..

## కుటుంబాలకు రూ. 2 లక్షల కోట్ల ఆదా



**ఆయుష్మాన్ భారత్ పథకానికి ఎనిమిదేళ్లు పూర్తి**

**60 కోట్ల మందికి రూ. 5 లక్షల వార్షిక ఆరోగ్య రక్షణ**

**దేశవ్యాప్తంగా 1.86 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల ఏర్పాటు**

**ఈ నెట్‌వర్క్‌లో 38,000కు పైగా ఆసుపత్రులు భాగం**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం విజయవంతంగా ఎనిమిదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం స్పందిస్తూ.. మిగతా 2లో...

# ఈసీల నియామకంపై సుప్రీం భిన్న తీర్పు

**విస్తృత ధర్మాసనానికి పంపడంపై ఇద్దరు న్యాయమూర్తుల మధ్య విభేదం**

**రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుపై సీజేఐకి సిఫారసు**




**న్యూఢిల్లీ సెప్టెంబర్23 (జర్నలిస్ట్ వార్త):**
ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్ల (ఈసీలు) నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం భిన్న తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించాలన్న కేంద్ర మిగతా 2లో...

# కొత్త ఇంచార్జ్‌లు

**28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత రాష్ట్రాలకు కొత్త ఇంచార్జ్‌లను నియమించిన బీజేపీ అధిష్ఠానం**

**ఏపీ బీజేపీ ఇంచార్జ్‌గా అర్వింద్ భదౌరియా**

**తెలంగాణ ఇంచార్జ్‌గా సునీల్ భన్సల్ -ఒడిశా ఇంచార్జ్‌గా పురందేశ్వరి**



**న్యూఢిల్లీ సెప్టెంబర్23, (ప్రజావినికిడి):**
రాబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో విజయమే ఏకైక లక్ష్యంగా బీజేపీ అధినాయకత్వం పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని భారీగా ప్రక్షాళన చేసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జ్‌లు, సహ-ఇంచార్జ్‌ల జాబితాను బీజేపీ జాతీయమిగతా 2లో...




# జూరాలకు నీటి విడుదలకు ఓకే

**జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక అంగీకారం**

**విడతల వారీగా 3 టీఎంసీలు ఇచ్చేందుకు సీఎం డీకే శివకుమార్ సుముఖత**

**బెంగళూరులో కర్ణాటక సీఎంతో తెలంగాణ మంత్రుల బృందం భేటీ**

**జూరాల కింద రైతుల ఇబ్బందులను వివరించిన మంత్రులు జూపల్లి, శ్రీహరి**

**హైదరాబాద్ సెప్టెంబర్23(ప్రజావినికిడి):**
తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. విడతల వారీగా 3 టీఎంసీల నీటిని ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ఈ నిర్ణయంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మిగతా 2లో...

# రైలు ఢీకొని నలుగురు విద్యార్థుల దుర్మరణం

**శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఘోర రైలు ప్రమాదం**

**భారీ వర్షం కారణంగా రైలు రాకను గమనించలేకపోయిన విద్యార్థులు**

**పట్టాల సమీపంలో చేపలు పడుతుండగా జరిగిన దుర్ఘటన**

**మరో విద్యార్థికి తీవ్ర గాయాలు..**



# వాయుగుండం ముప్పు

**ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా తీరం వైపు వేగంగా పయనం**

**కళింగపట్నం సమీపంలో తీరం దాటే అవకాశం**

**విశాఖపట్నం, గోపాల్‌పూర్ మధ్య తీరం దాటనుందని అంచనా**

**తీర ప్రాంతాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తం**



**అమరావతి(ప్రజావినికిడి):**
బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఉత్తరాంధ్ర తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ వాయుగుండం, రాగల కొన్ని గంటల్లో తీరాన్ని తాకనుంది. బుధవారం రాత్రి ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. మిగతా 2లో...

# డీఎస్సీ మెగా స్కామ్..

# సీబీఐ విచారణ జరిపించండి

## గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ కిజగన్ ఫిర్యాదు

**అమరావతి(ప్రజావినికిడి):**
డీఎస్సీ అక్రమాలపై విజయవాడలోని క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) కార్యాలయం వద్ద తమ పార్టీ నేతలు నిరసన ప్రదర్శన చేపట్టారని, ఈ సందర్భంగా తమ నేతలపై దాడి జరిగిందని వైసీపీ అధినేత జగన్ నేడు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. డీఎస్సీ స్కామ్‌కు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని, ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని జగన్ డిమాండ్ చేశారు. గవర్నర్‌తో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్, డీఎస్సీ కుంభకోణం ఎలా మిగతా 2లో...



# తెలంగాణ ఉద్యోగులకు రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

**సీఎస్‌తో ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమావేశం**

**అక్టోబర్ జీతంతో మొదటి డీఏ చెల్లింపు**

**ఉగాది సందర్భంగా రెండో డీఏ విడుదల**

**చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలు**

**పీఆర్సీపై ఇంకా నిర్ణయం ప్రకటించని ప్రభుత్వం**



# కాంగ్రెస్ వైఫల్యం వల్లే కరెంటు కోతలు

**బొగ్గు కొరతతో థర్మల్ విద్యుత్ ప్లాంట్ల మూత**

**జెన్‌కోకు నాసిరకం బొగ్గు సరఫరాతో రూ.2,900 కోట్ల నష్టం**

**నేడు పవర్‌ప్లాంట్ల సందర్శన : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్ (ప్రజావినికిడి):**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యం వల్లే కరెంటు కోతలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. బొగ్గు కొరత కారణంగా థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి నిలిపేస్తున్నారని అన్నారు. నీటి కొరత వల్ల జల విద్యుత్ కేంద్రాలు కూడా విద్యుత్ ఉత్పత్తి చేయలేకపోతున్నాయని చెప్పారు. ఇప్పుడే విద్యుత్ కోతలు ఇలా ఉంటే వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ కేంద్రాల వద్ద వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు గురువారం ఆరు బీఆర్ఎస్ బృందాలు రాష్ట్రంలోని థర్మల్ పవర్ ప్లాంట్లు, సింగరేణి ప్రధాన మిగతా 2లో...



# కొత్త ఇంచార్జ్‌లు

**మొదటిపేజీ తరువాయి**

అధ్యక్షుడు నితిన్ నబీన్ అధికారికంగా ప్రకటించారు. ప్రాంతీయ రాజకీయ సమీకరణలు, ఎన్నికల వ్యూహాలను ప్రామాణికంగా తీసుకుని కీలక నేతలకు ఈ బాధ్యతలు కట్టబెట్టారు. తెలంగాణ: సునీల్ భన్సల్ ఇంచార్జ్‌గా వ్యవహరించనుండగా, అభయ్ పాటిల్, రేఖా శర్మ సహ-ఇంచార్జ్‌లుగా నియమితులయ్యారు. (సునీల్ భన్సల్ పశ్చిమ బెంగాల్ ఇంచార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు).

**ఆంధ్రప్రదేశ్:** అర్వింద్ భదౌరియా ఇంచార్జ్‌గా, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ సహ-ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు.

**తమిళనాడు:** రామ్ మాధవ్ ఇంచార్జ్‌గా ఎంపికవ్వగా,



కో-ఇంచార్జ్‌లుగా డీకే అరుణ, నిర్మల్ కుమార్ సురాణా బాధ్యతలు చేపట్టనున్నారు.

**ఒడిశా:** దగ్గుబాటి పురందేశ్వరి ఇంచార్జ్‌గా, డాక్టర్ స్వదేశ్ సింగ్ సహ-ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

**కర్ణాటక:** హరీశ్ ద్వివేది ఇంచార్జ్‌గా... తెలంగాణకు చెందిన డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహ-ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు.

**ఉత్తర ప్రదేశ్:** దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న యూపీకి జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు. ఆయనకు తోడుగా నలుగురు సహ-ఇంచార్జ్‌లను కేటాయించారు.

**మహారాష్ట్ర:** బైజయంత్ జయ్ పాండా ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు. ఆయనకు సహాయంగా అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్‌లను సహ-ఇంచార్జ్‌లుగా నియమించారు.

**ఛత్తీస్‌గఢ్ -** హర్యానా: మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి ఈ రెండు రాష్ట్రాల ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించారు.

**ఢిల్లీ:** డాక్టర్ వినయ్ సహస్రబుద్ధే ఇంచార్జ్‌గా, జాంయాంగ్ త్సేరింగ్ నామ్‌గ్యాల్, దర్శనాబెన్ జర్దోష్‌లను కో-ఇంచార్జ్‌లుగా నియమించారు.

**గుజరాత్:** తరుణ్ చుగ్ ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

**హిమాచల్ ప్రదేశ్:** శ్రీకాంత్ శర్మ ఇంచార్జ్‌గా వ్యవహరించనున్నారు.

**మధ్యప్రదేశ్:** మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్ ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

# ఎనిమిదేళ్ల ఆయుష్మాన్ భారత్..

**మొదటిపేజీ తరువాయి**

ప్రతి భారతీయుడికి నాణ్యమైన, అందుబాటు ధరలో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించినట్లు గుర్తుచేశారు. ఈ పథకం ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంగా నిలిచిందని ఆయన కొనియాడారు.

ఈ విషయంపై ప్రధాని మోదీ సోషల్ మీడియా 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "ఎనిమిదేళ్ల క్రితం, ప్రతి భారతీయుడికి అత్యుత్తమ, అందుబాటు ధరలో వైద్యం అందాలనే ఆలోచనతో ఆయుష్మాన్ భారత్ ప్రారంభమైంది. ఈ రోజు, 60 కోట్లకు పైగా లబ్ధిదారులకు ఏటా రూ. 5 లక్షల ఆరోగ్య కవరేజీ అందుబాటులో ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య పథకం" అని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య ఖర్చులు రికార్డు స్థాయిలో ఆదా అవుతున్నాయని ప్రధాని తెలిపారు. అంతేగాక ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల ద్వారా వైద్య సేవలు ప్రజల ముంగిటకే చేరుతున్నాయని, ఇప్పటికే ఈ కేంద్రాల్లో 500 కోట్లకు పైగా సందర్శనలు నమోదయ్యాయని ప్రధాని వివరించారు. ఈ పథకం ద్వారా గ్రామీణ స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ బలపడుతోందని ఆయన అన్నారు. ఆయుష్మాన్ భారత్ ఎనిమిదేళ్ల ప్రస్థానంలో సాధించిన విజయాలను MyGovIndia కూడా తన పోస్టులో వివరించింది. ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎం-జేఏవై) కింద అందించిన ఉచిత చికిత్సల వల్ల కుటుంబాలకు రూ. 2 లక్షల కోట్లకు పైగా వైద్య ఖర్చులు ఆదా అయ్యాయని తెలిపింది. దేశవ్యాప్తంగా 38,000కు పైగా ఆసుపత్రులు ఈ నెట్‌వర్క్‌లో భాగమయ్యాయని, ఇప్పటివరకు 13 కోట్లకు పైగా హాస్పిటల్ అడ్మిషన్లు జరిగాయని పేర్కొంది.

70 ఏళ్లు పైబడిన ఆరు కోట్ల మంది సీనియర్ సిటిజన్లను వారి సామాజిక, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ఈ పథకం పరిధిలోకి తీసుకువచ్చారు. మొత్తం ఆయుష్మాన్ కార్డుల్లో దాదాపు సగం మహిళల పేరు మీద ఉండటం గమనార్హం.

ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా 1.86 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా మధుమేహం, రక్తపోటు కోసం 42 కోట్లకు పైగా స్క్రీనింగ్‌లు, అలాగే నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల కోసం కోట్ల సంఖ్యలో పరీక్షలు నిర్వహించారు.

ఈ పథకం పోర్టబిలిటీ సదుపాయం ద్వారా లబ్ధిదారులు తమ సొంత రాష్ట్రం వెలుపల కూడా రూ. 8,800 కోట్లకు పైగా విలువైన 30 లక్షలకు పైగా చికిత్సలు పొందారని వీఎ+శీజ×అఇఖు వెల్లడించింది. మొత్తంగా, 60 కోట్ల మందికి రూ. 5 లక్షల ఆరోగ్య బీమా అందిస్తూ, తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో ఈ పథకం ఆర్థిక భద్రతను కల్పిస్తోంది.

# విద్యుదుత్పత్తి ఆగడానికి వీల్లేదు

**మొదటిపేజీ తరువాయి**

చర్యలు తీసుకోవాలని సూచించారు.

జెన్‌కోకు నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. బుధవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో విద్యుత్తు శాఖపై రేవంత్ సమీక్ష నిర్వహించారు. దసరాలోపు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని అన్ని యూనిట్లలో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్లాంట్‌కు అవసరమైన బొగ్గును ఒడిసాలోని మహానది కోల్‌ఫీల్డ్ నుంచి పొందడానికి వీలుగా, లింకేజీ కోసం కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ, కోల్ ఇండియాతో సంప్రదింపులు జరపాలని నిర్దేశించారు. యాదాద్రిలో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి జరగకపోవడానికి కారణాలపై ఆరా తీశారు. అయితే యాదాద్రిలోని యూనిట్లన్నీ కూడా జీ-9 రకం బొగ్గును మండించడానికి వీలుగా డిజైన్ చేసినవేనని, సింగరేణిలో జీ-9 రకం బొగ్గు లభించదని సీఎం అధికారులు నివేదించారు. రాష్ట్రంలో జీ-9 రకం బొగ్గు లభించకపోతే ఆ సాంకేతికతో యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం ఎలా చేపట్టారని సీఎం ప్రశ్నించారు.

దీనికి అధికారులు వివరణ ఇస్తూ.. ప్లాంట్‌కు అనుమతి పొందే క్రమంలో విదేశాల నుంచి బొగ్గును దిగుమతి చేసుకుంటామని అనుమతులు తెచ్చుకున్నట్లు చెప్పారు. యాదాద్రి పవర్‌ప్లాంట్ పర్యావరణ అనుమతులు సస్పెండయ్యాక సింగరేణి నుంచి బొగ్గు తెచ్చుకుంటామని కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖకు నివేదించడం జరిగిందని వారు చెప్పారు. సాధారణంగా థర్మల్ ప్లాంట్‌లన్నీ బొగ్గు గనుల పిట్‌హెడ్‌లో కట్టాలని కేంద్ర విద్యుత్తు సంస్థ (సీఈఏ) మార్గదర్శకాలు ఉన్నాయని, యాదాద్రికి 270 నుంచి 300 కి.మీ దూరంలో బొగ్గు బ్లాకులు ఉన్నాయని అధికారులు వివరించారు. సుదూర ప్రాంతం నుంచి బొగ్గును యాదాద్రికి తరలించడం వల్ల రానున్న 25 ఏళ్లలో రూ.40 వేల కోట్ల అదనపు భారం ప్రజలపై పడనుందని తెలిపారు. సింగరేణిలోని ఏ బ్లాకులో కూడా జీ-9 రకం బొగ్గు లేదని సింగరేణి అధికారులు వివరించారు. గత ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడం వల్లే జీ-9 రకం బొగ్గును సరఫరా చేయలేకపోతున్నామని చెప్పారు. సింగరేణిలో ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయని అధికారులు తెలిపారు. కాగా సాగు అవసరాల కోసం సోలార్ విద్యుదుత్పాదన జరుగుతున్న సమయంలోనే కరెంటు అందించాలని కేంద్ర ప్రభుత్వం డిస్కమ్‌లకు ఆదేశాలు ఇచ్చిందని సీఎంకు అధికారులు వివరించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సోలార్ అవర్‌లలోని వ్యవసాయానికి విద్యుత్తు అందించాలని కేంద్రం మార్గదర్శకాలు ఉన్నాయని నివేదించారు. కాగా రైతు డిస్కమ్ ఏర్పాటు ప్రక్రియపై కూడా అధికారులను ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఈఆర్‌సీ లైసెన్స్ ఇచ్చినందున ఎప్పట్లోగా రైతు డిస్కమ్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తక్షణ మే లాంఛనాలన్నీ పూర్తి చేసి, రైతు డిస్కమ్ కార్యకలాపాలు ప్రారంభించాలని ఆదేశించారు.

# కాంగ్రెస్ వైఫల్యం వల్లే కరెంటు కోతలు

**మొదటిపేజీ తరువాయి**

కార్యాలయాన్ని సందర్శించనున్నాయని వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు కరెంట్ విలాస వస్తువు కాదనీ, జీవనరేఖ అని అన్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, పరిశ్రమలు, ఐటీ రంగం, గృహ అవసరాలు అన్నింటికీ విద్యుత్ అత్యంత కీలకమని చెప్పారు. విద్యుత్ సమస్యపైనే తెలంగాణ మలిదశ ఉద్యమానికి పునాది పడిందని గుర్తుచేశారు.

**'ఎల్‌నినో కాదు.. ఎల్ కాంగో'**

విద్యుత్ సంక్షోభానికి ఎల్‌నినో ప్రభావం కారణం కాదనీ, ఎల్ కాంగో (కాంగ్రెస్) ప్రధాన కారణమని కేటీఆర్ విమర్శించారు. విద్యుత్ సంక్షోభానికి సింగరేణి బొగ్గు సరఫరా వ్యవస్థ కూడా ఒకటని అన్నారు.

**సింగరేణితో సర్కార్ ఫుట్‌బాల్**

సింగరేణి సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఫుట్‌బాల్ ఆట ఆడుతున్నదని కేటీఆర్ అన్నారు. సింగరేణితో కార్మికులు, రైతులు, ప్రజలు ఆటలాడే పరిస్థితి రావొద్దని కోరారు. సింగరేణిలో సైట్ విజిటేషన్ సర్టిఫికెట్ల పేరుతో అక్రమాలు, సోలార్ పవర్ టెండర్లలో అవకతవకలు జరిగాయని విమర్శించారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి 2023-24లో 70 మిలియన్ టన్నుల నుంచి 2025-26లో 58 మిలియన్ టన్నులకు ఎందుకు పడిపోయిందని ప్రశ్నించారు.

**వ్యవసాయానికి ఆరు గంటల కరెంటు**

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయానికి ఆరు గంటలకు మించి కరెంట్ సరఫరా కావడం లేదని కేటీఆర్ ఆరోపించారు.

**కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు**

'కాంగ్రెస్ అధికారంలో ఉంటే కరెంటు ఉండదని కేటీఆర్ అన్నారు. అదే ఇప్పుడు నిజమైందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనూ రైతులు విద్యుత్ కోతలపై రోడ్డెక్కారని గుర్తు చేశారు. విద్యుత్ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఆరు బీఆర్‌ఎస్ బృందాలు గురువారం పవర్ స్టేషన్లను సందర్శిస్తాయని చెప్పారు.

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌ను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్, భూపాలపల్లిలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి,చెన్నూరు నియోజకవర్గం జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, అనిల్ జాదవ్‌ల బృందం సందర్శిస్తుందని వివరించారు. హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే వివేకానందగౌడ్ పరిశీలిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రులు తాటికొండ రాజయ్య, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, ఎల్ రమణ, ఎమ్మెల్యేలు కెపి వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు ఎ జీవన్‌రెడ్డి, బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత

**ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వమే కారణమన్న కవిత**

**ఐదుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోతే రేవంత్ కు పరామర్శించే సమయం కూడా లేకపోయిందని మండిపాటు**

**నెల రోజుల్లోగా ప్రభుత్వ ఆసుపత్రులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని హెచ్చరిక**

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ లో చోటుచేసుకున్న ఏసీ పేలుడు ఘోర ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈ ఘటనలో ఐదుగురు పసికందులు మరణించడం అత్యంత ఆవేదన కలిగిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని సురక్ష చిల్డ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి తల్లిదండ్రులను నేడు ఆమె పరామర్శించి ఓదార్చారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐదుగురు గిరిజన, మైనార్టీ పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతే కనీసం వచ్చి పరామర్శించే సమయం కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. వైఫల్యాలను ఎండగడుతూ, సీఎంకు నెల రోజుల గడువు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవధిలోగా ప్రభుత్వ ఆసుపత్రుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, గిరిజన గూడేలకు రహదారి సదుపాయాలు కల్పించాలని, కేంద్ర నిధుల వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులకు నిధులు కేటాయించకపోతే ఆదివాసీలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 'ఘెరావ్' చేపడతామని హెచ్చరించారు. రిమ్స్‌లో 150 ఏసీలు ఉన్నా ఒక్క మెకానిక్ కూడా లేకపోవడం, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో రూ.500 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వైద్యారోగ్య రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు.

# రైలు ఢీకొని నలుగురు విద్యార్థుల దుర్మరణం

## శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఘోర రైలు ప్రమాదం

**టెక్కలి సెప్టెంబర్23(ప్రజావినికిడి):**

శ్రీకాకుళం జిల్లాలో శనివారం అత్యంత విషాదకరమైన ఘటన చోటుచేసుకుంది. టెక్కలి సమీపంలో రైలు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు ఇంటర్మీడియట్ విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘోర ప్రమాదంతో స్థానికంగా తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు టెక్కలి మండలం రావివలస వద్ద రైలు పట్టాల సమీపంలో వర్షపు నీరు భారీగా వచ్చి చేరింది. ఈ నీటిలో చేపలు పట్టేందుకు ఐదుగురు విద్యార్థులు వెళ్లారు. వేట ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో వారు పట్టాలు దాటుతుండగా, అదే సమయంలో భువనేశ్వర్ నుంచి గుణుపూర్ వెళుతున్న రాజారాణి ఎక్స్‌ప్రెస్ వేగంగా వచ్చి వారిని ఢీకొట్టింది. కురుస్తున్న భారీ వర్షం, వీస్తున్న బలమైన ఈదురు గాలుల కారణంగా వెనుక నుంచి వస్తున్న రైలు శబ్దాన్ని విద్యార్థులు గమనించలేకపోయారు. ఈ ప్రమాదంలో విశాఖ రావు, దిలీప్, శరత్, శివ అనే నలుగురు విద్యార్థులు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. సాల్మన్ రాజు అనే మరో విద్యార్థికి తీవ్ర గాయాలు కాగా, అతడిని చికిత్స నిమిత్తం వెంటనే టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మృతులంతా టెక్కలి మండలం డమరు గ్రామానికి చెందిన వారని, టెక్కలిలోని ప్రభుత్వ ఎస్సీ/ఎస్టీ వసతి గృహంలో ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతున్నారని అధికారులు వెల్లడించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒకే గ్రామానికి చెందిన నలుగురు యువకులు మృతి చెందడంతో బాధితుల కుటుంబాల్లోను, గ్రామంలోనూ రోదనలు మిన్నంటాయి.

# జూరాలకు నీటి విడుదలకు ఓకే

**మొదటిపేజీ తరువాయి**

రైతులకు భారీ ఊరట లభించినట్లయింది.

ఈ మేరకు బుధవారం తెలంగాణ మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి నేతృత్వంలోని ప్రజాప్రతినిధుల బృందం బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమైంది. జూరాల ప్రాజెక్టు కింద నీటి అవసరాలను, వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను వారు ఆయనకు వివరించారు. తెలంగాణ మంత్రుల విజ్ఞప్తిని పరిశీలించిన డీకే శివకుమార్, అధికారులతో చర్చించిన అనంతరం జూరాలకు నీటిని విడుదల చేసేందుకు అంగీకరించారు. దీంతో జూరాల ఆయకట్టు కింద ఎండిపోతున్న పంటలకు జీవం పోసినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కర్ణాటక సానుకూలంగా స్పందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# వాయుగుండం ముప్పు

**మొదటిపేజీ తరువాయి**

ఈ పరిణామంతో కోస్తా ప్రాంతాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

ప్రస్తుతం ఈ వాయుగుండం గత ఆరు గంటలుగా గంటకు 5 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా కదులుతోంది. ఇది కళింగపట్నానికి ఆగ్నేయంగా 50 కిలోమీటర్ల దూరంలో, విశాఖపట్నానికి 120 కిలోమీటర్ల దూరంలో, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 150 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. పూరీకి ఇది 250 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్టు అధికారులు తెలిపారు.

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ వాయుగుండం పశ్చిమ-వాయవ్య దిశగా ప్రయాణించి, ఈ రోజు రాత్రి 8:30 నుంచి 11:30 గంటల మధ్య విశాఖపట్నం - గోపాల్‌పూర్ మధ్య తీరం దాటనుంది. ముఖ్యంగా కళింగపట్నానికి అత్యంత సమీపంలో ఇది భూభాగాన్ని తాకుతుందని అధికారులు స్పష్టం చేశారు. తీరం దాటే సమయంలో కూడా ఇది తీవ్ర వాయుగుండంగానే కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాలోని తీర ప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. బలమైన ఈదురు గాలులు వీస్తాయని, సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని హెచ్చరించారు. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లవద్దని, తీర ప్రాంత ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు జారీ చేశారు. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను కూడా సిద్ధం చేశారు.

## తెలంగాణ ఉద్యోగులకు రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్ (ప్రజావినికిడి):**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కారు తీపి కబురు చెప్పింది. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం (డీఏ) విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమయ్యారు. ఉద్యోగుల డిమాండ్లపై చర్చించిన అనంతరం రెండు డీఏలకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ప్రభుత్వం ఆమోదించిన రెండు డీఏల్లో మొదటిదాన్ని అక్టోబర్ నెల జీతంతో కలిపి ఉద్యోగులకు చెల్లించనుంది. దీంతో చాలాకాలంగా డీఏ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఊరట లభించనుంది. రెండో డీఏను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో రెండు విడతల్లో ఉద్యోగులకు డీఏ ప్రయోజనం అందనుంది. అయితే డీఏలపై నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. ఉద్యోగులు కోరుతున్న పీఆర్సీపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఉద్యోగ సంఘాలు పీఆర్సీ అమలు కోసం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం డీఏలకే పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది. పీఆర్సీపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది.

## డీఎస్సీ మెగా స్కామ్..సీబీఐ విచారణ జరిపించండి

**మొదటిపేజీ తరువాయి**

జరిగిందో ఆధారాలతో సహా గవర్నర్ కు వివరించినట్లు తెలిపారు. శాప్ కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు అనుమతి తీసుకున్నప్పటికీ, అదే సమయంలో, అదే ప్రదేశంలో టీడీపీ గూండాలు ధర్నా నిర్వహించారని ఆరోపించారు. గతంలో 'సాక్షి' కార్యాలయాలపై దాడి చేసిన వారే ఈ దాడిలో పాల్గొని, నిరుద్యోగ యువత, వైసీపీ కార్యకర్తలపై దౌర్జన్యానికి పాల్పడ్డారని అన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బాధితులపైనే ప్రభుత్వం తీవ్రమైన సెక్షన్లతో కేసులు నమోదు చేయడం దారుణమని ఆయన విమర్శించారు. ఈ రెండు ఘటనలతో పాటు డీఎస్సీ పరీక్షల నిర్వహణ నుంచి అభ్యర్థుల నియామకాల వరకు జరిగిన అక్రమాల తీరును గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు జగన్ వివరించారు. ఎస్‌సీఈఆర్‌టీకి నేతృత్వం వహిస్తున్న ఒకే వ్యక్తికి ప్రశ్నపత్రం రూపకల్పన, పరీక్షల నిర్వహణ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ఈ పరీక్షల్లో ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంక్ వచ్చినా ఉద్యోగం ఇవ్వలేదని, ఇది ప్రశ్నపత్రం లీక్ అయిందనడానికి నిదర్శనమని వైసీపీ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.

తమకు కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రత్యేక జీవోలు జారీ చేసి, నియామకాలు పూర్తయ్యాక వాటిని రద్దు చేశారని, ఇది అక్రమాలకు బలమైన ఆధారమని జగన్ అన్నారు. కొందరు అభ్యర్థులు కనీసం టెట్ పరీక్ష కూడా రాయకుండానే ఉద్యోగాలు పొందారని, ఈ విధంగా 372 మందిని నిబంధనలకు విరుద్ధంగా నియమించారని ఆరోపించారు. టీడీపీ నేతల ఆధ్వర్యంలోని సాఫ్ట్‌బాల్, జూడో సంఘాలు జారీ చేసిన నకిలీ క్రీడా ధ్రువపత్రాలతో కొందరు ఉద్యోగాలు సంపాదించారని, ఈ విషయంలో శాప్, సంబంధిత సంఘాల మధ్య పరస్పర విరుద్ధ ప్రకటనలు వస్తున్నాయని తెలిపారు. ఉద్యోగాల అమ్మకాలకు సంబంధించిన ఆడియో, వీడియో ఆధారాలు సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని జగన్ విమర్శించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. అన్ని ఆధారాలు ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నందున, మంత్రి లోకేశ్ రాజీనామా చేసి, సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో సుప్రీంకోర్టు చేసిన తీవ్ర వ్యాఖ్యలు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటివని జగన్ గుర్తుచేశారు. ఈ అక్రమాలపై న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## ఈసీల నియామకంపై సుప్రీం భిన్న తీర్పు

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వ అభ్యర్థనపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. దీంతో కేసును తగిన సంఖ్యలో న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ముందుంచాలని ఇద్దరు న్యాయమూర్తులు ఏకాభిప్రాయానికి వచ్చారు. 2023లో పార్లమెంట్ ఆమోదించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) చట్టంలో సీఈసీ, ఈసీల నియామక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో ప్రధానమంత్రి నామినేట్ చేసే కేంద్ర మంత్రిని చేర్చారు. ప్రస్తుతం ఈ కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత, ప్రధానమంత్రి నామినేట్ చేసిన కేంద్ర మంత్రి సభ్యులుగా ఉంటారు. ఈ మార్పునే పిటిషనర్లు సవాల్ చేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
గురువారం 24 సెప్టెంబర్ 2026

# ఆకాశం నుంచి పూలవర్షం

## భక్తిశ్రద్ధలతో గణనాథుడి వీడ్కోలు..




**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
నవరాత్రులు భక్తులతో పూజలందుకున్న గణనాథుడికి దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్ లో అగ్లీ బార్ జల్దీ ఆనా అంటూ ఘనంగా వీడ్కోలు పలికారు. హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భౌరంపేట్ బొడ్రాయి వద్ద నిర్వహించిన గణనాథుడికి ఘన వీడ్కోలు కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ఘన వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సరుగారి ధర్మారెడ్డి స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, బౌరంపేట్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల సమస్యలపై ఐక్యంగా పోరాడుదాం..

### ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఉమామహేష్ పిలుపు..

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
గండి మైసమ్మ చౌరస్తా నుండి వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు నేడు ఏఐటీయూసీ సంఘంలో చేరడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఉమామహేశ్వర పాల్గొని వారికి సభ్యత్వాలు ఇచ్చి ఏఐటీయూసీలోకి ఆహ్వానం పలకడం జరిగింది. ఈ సందర్భంగా వారు



మాట్లాడుతూ ఏఐటీయూసీ కార్మికుల కోసం కార్మిక హక్కులు కాపాడడానికి 100 సంవత్సరాల క్రితమే ఆవిర్భవించి నేటికీ దేశంలో అతిపెద్ద గుర్తింపు సంఘం పనిచేస్తుందని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో అన్ని ప్రాంతాలలో విస్తరించబడిన ఏకైక సంఘం ఏఐటీయూసీ అని కావున అందులో చేరి సభ్యత్వం తీసుకోవడం చాలా గర్వకారణం అని అన్నారు. ఈ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వాటిని సాధించుకునేంతవరకు ఆటో డ్రైవర్లు ఐక్యంగా ఉద్యమించాలని దానికి సిపిఐ మరియు ఏఐటియుసి సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమర్ ఖాన్ జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి జిల్లా నాయకులు నర్సింహులు సిపిఐ నాయకులు రాములు బాబు అతిథులుగా పాల్గొని ఆటో డ్రైవర్లకు ఏ కష్టం వచ్చినా స్పందిస్తామని వారి సమస్యల పరిష్కారం కోసం నిత్య అందుబాటులో ఉంటామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఆటో డ్రైవర్లు ఖలీల్ అఖిల్ అహ్మద్ బాబర్ రాములు నరసింహ తదితరులతో పాటు పెద్ద ఎత్తున ఏఐటియుసిలో చేరడం జరిగింది.

## గౌతమ్ నగర్ గణేష్ మండపం వద్ద ఘనంగా హోమాలు

**ఎల్బీనగర్, సెప్టెంబర్ 23,(ప్రజావినికిడి):**
గడ్డి అన్నారం డివిజన్,గౌతమ్ నగర్ కాలనీ వినాయక మండపం వద్ద నిర్వాహకులు వివిధ రకాల హోమాలను నిర్వహించారు. గణపతి,లక్ష్మి, సరస్వతి, నవగ్రహ, మృత్యుంజయ హోమాలతో సహా 10 రకాల హోమాలను నిర్వహించినట్టు గౌతమ్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కళ్ళెం మధు



సూధన్ రెడ్డి తెలిపారు.భారతీయ సనాతన ధర్మంలో హోమాలకు ఆధ్యాత్మికంగా, వైజ్ఞానికంగా ఎంతో ప్రాధాన్యం ఉందని అగ్ని దేవుడిని మాధ్యమంగా చేసుకుని దేవతలకు ఆహుతులు సమర్పించడం వల్ల ప్రకృతిలో సానుకూల శక్తి పెరిగి,వర్షాలు కురిసి సమస్త ప్రాణికోటి సుభిక్షంగా ఉంటుందన్నారు. హోమద్రవ్యాలను అగ్నిలో వేయడం వల్ల గాలిలోని హానికారక బ్యాక్టీరియాను నశింపజేసి, వాతావరణాన్ని, పరిసరాలను శుభ్రపరుస్తుందన్నారు.హోమ సమయంలో ఉచ్చరించే వేద మంత్రాల కంపనాలు, అందులో వేసే ద్రవ్యాల సువాసన మనసులోని ఆందోళనలను తొలగించి, అంతఃకరణ శుద్ధిని,మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని కళ్ళెం మధుసూధన్ రెడ్డి వివరించారు. పలువురు కాలనీ వాసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గ్రీన్ వుడ్ కాలనీ లో నిమజ్జనానికి తరలి వెళ్తున్న గణపయ్య



**హయత్ నగర్,(ప్రజావినికిడి):**హయత్ నగర్ డివిజన్ పరిధిలోని గ్రీన్ వుడ్ కాలనీ లో వినాయక నిమజ్జనం వేడుకలను ఘనంగా నిర్వహించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.కాలనీ వాసులు ఉత్సాహంగా లడ్డు వేలంలో పాల్గొన్నారు. ఆటపాటలతో చిన్నారులు, మహిళలు, యువత,పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.యువత ప్రత్యేక ఉత్సాహంతో కార్యక్రమాల్లో పాల్గొని వేడుకలకు మరింత శోభ తీసుకువచ్చారు. వినాయక మండప సమీపంలోనే నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో జక్క గణేష్ రెడ్డి కాలని అధ్యక్షుడు ఉపాధ్యక్షుడు మల్లెపల్లి రవీందర్ రెడ్డి . కృష్ణారెడ్డిసెక్రెటరీ సోం సుందర్ రావు,జక్క రామ్ రెడ్డి,జక్కిడి వెంకాంట్ రెడ్డి,వెంకటేష్ ,తిరుమల రావు, సురభి శ్రీనివాస్ రెడ్డి.కొరవి రుక్మిణి గుండాల మంజుల బొడ్డు హేమలత,జక్క వరలక్ష్మి జక్క రాణి జక్కిడి జ్యోతి కొత్త గీత సుదర్శన్ వాసంతి నవనీత ఐలయ్యా,ఓంకార్, తదితరులు పాల్గొన్నారు.

# సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా 295 బౌరంపేట్ డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ ఆరోగ్య శిబిరం






**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
దుండిగల్ సర్కిల్ బౌరంపేట్ వార్డు కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ 11వ ఆయుర్వేద దినోత్సవం పురస్కరించుకొని ఆయుష్ డిపార్ట్మెంట్ తెలంగాణ గవర్నమెంట్ హోమియో వైద్య అధికారులచే ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం అనే సంకల్పంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా పాల్గొన్న బౌరంపేట్ మాజీ సర్పంచ్ బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డా.ఎస్ మల్లారెడ్డి యోగ ఆయుర్వేదం హోమియోపతి ద్వారా అనేక అనారోగ్య సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది ప్రధానమంత్రి నరేంద్ర మోడీ యోగాను మరియు ఆయుర్వేదాన్ని ప్రోత్సహిస్తూ ప్రజలకు చేరువ చేస్తూ అనేక సంస్కరణ తీసుకురావడం జరిగింది.అత్యవసరమైతే తప్ప ఆసుపత్రులకు పోయి ఆర్థిక కష్టాలు తెచ్చుకోకుండా ప్రతి చిన్న చిన్న అనారోగ్య సమస్యలకు బౌరంపేట్ ఆయుర్వేదాన్ని హోమియోపతిని వినియోగించుకోవాలని దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్క చిన్న జ్వరం వచ్చినా దగ్గు వచ్చినా తలనొప్పి వచ్చిన దెబ్బ తగిలిన ప్రతి ఒక్కరు పెద్ద హాస్పిటల్ పోవడం ఇంగ్లీష్ మందులు వేసుకోవడం బాగా అలవాటు చేసుకున్నారు వాటి వల్ల తాత్కాలిక ఉపశమనం ఉన్న తర్వాత అనేక అనారోగ్య సమస్యలు రావడమే కాకుండా అనేక ఆర్థిక ఇబ్బందులు కూడా తెచ్చుకుంటున్నారు.
ఏ హాస్పిటల్ కు వచ్చిన టెస్టు కోసం వస్తే ఈ టెస్ట్ ఆటెస్ట్ అని చెప్పి లేని రోగాన్ని చూపించి లక్షల రూపాయలు దండుకుంటున్న ఆస్పత్రులు సైన్స్ డెవలప్ అయ్యింది అంటున్నారు. కానీ ఎన్ని ప్రాణాలు పోతున్నాయి మనం ప్రతిరోజు చూస్తూనే ఉన్నాం లక్షల రూపాయలు పోతున్నాయి ప్రాణాలు కూడా పోతున్నాయి కావున చిన్న చిన్న వ్యాధులు ఏవి ఉన్నా మరీ నాటు వైద్యం లాంటివి కాకుండా స్థానికంగా బౌరంపేటలో ఉన్న ప్రభుత్వం చే నడపబడుతున్న యోగ అదేవిదంగా ఆయుర్వేద హోమియోపతి ద్వారా అనేక ఆరోగ్య సమస్యలు తీరుతున్నాయి ప్రత్యక్షంగా నేనే మొన్న విపరీతమైన తలనొప్పి ఒళ్ళు నొప్పులతో ఇబ్బంది పడుతూ ఉంటే ఇంగ్లీష్ మందులు వేసుకోవడం ఇష్టం లేక హోమియోపతి వెళ్లడం జరిగింది ఆ యొక్క డాక్టర్ రెండు నాలుక పైన చుక్కలు వేసి రెండు రోజులు గోలీలు వాడమన్నారు నాకు ఒక్క రోజుకే జ్వరం తలనొప్పి తగ్గిపోయింది వేరే ఆసుపత్రికి వెళ్లి ఉంటే సుమారు 500,1000 రూపాయలు పైన ఖర్చయ్యేది ఇది ప్రతి ఒక్కరికి తెలియజేస్తున్నాను దయచేసి ఈ యొక్క ఆయుర్వేద మరియు హోమియోపతిని యోగాను వాడుకొని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆయురారోగ్యాలతో ఉండాలని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కోరుకుంటునన్నారు ఈ కార్యక్రమంలో బౌరంపేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి మాజీ సర్పంచ్ కొమ్ము మంగమ్మ మాజీ ఎంపీటీసీ ఎస్ జంగారెడ్డి వైద్యదికారులు డా.బీ కళావతి డా.పట్లోళ్ల రాజ్ మోహన్,ఫార్మసిస్ట్ భాగ్యలక్ష్మి, శ్రమ శక్తి అవార్డు గ్రహీత అలాగే విశ్రాంత సీనియర్ రైల్వే ఉద్యోగి శ్రీ ఆర్వీఎస్ రాఘవరావు బీజేపీ సీనియర్ నాయకులు గోనె మల్లారెడ్డి, దమ్మగారి ప్రభాకర్ రెడ్డి,డి. సీతారాంరెడ్డి, కమ్మరి రమేష్ చారీ,జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షులు ఎం. వెంకటేష్ నాయక్, ఎం జంగారెడ్డి 294 బహదూర్ పల్లి డివిజన్ అధ్యక్షులు ఏ. శ్రీనివాస్ యాదవ్,296 దుండిగల్ డివిజన్ అధ్యక్షులు ఆకుల విజయ్ కొమ్ము ప్రశాంత్,తలారి రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులు అందజేసిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి..

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ, చికిత్స ఖర్చులకు సరిపడా ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరి పత్రాలు (చెక్కులు)అందజేశారు.
బచ్చు రమేష్ కు రూ. 60,000,డెఱుంగుల లక్ష్మికి రూ 45,000,మహ్మద్ చాంద్ పాషాకి రూ.60,000, దూసకంటి విజయ లక్ష్మకి రూ .60,000, కె.సీతా మహాలక్ష్మికిరూ . 60,000,కట్కోజ్వాలా రత్నాకర్ కి రూ .60,000,బాడిగ రవి చంద్రశేఖర్ కి రూ .32,500,పి.విష్ణు వర్ధన్ రెడ్డికి రూ . 60,000,గొల్ల



జనార్ధన్ కి రూ .40,000 అందజేశారు.
ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఆయన తెలిపారు.
ఈ కార్యక్రమంలో జాతీయ దళిత సంక్షేమ సంఘం



అధ్యక్షులు రత్న డా.బుధల అమర్ బాబు, డీసీసీ ఉపాధ్యక్షులు బుయ్యని శివ కుమార్, సెక్రటరీలు గణేష్, సంతోష్ ముదిరాజ్, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, రంగ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు జలీల్ ఖాన్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు బేకు శ్రీనివాస్, బోయిని వెంకటేష్,శ్రీధర్ వర్మ, చంద్రకళ, మధుసూదన్ రెడ్డి,అంజి రెడ్డి, సోము,శ్యామ్, కుత్బుల్లాపూర్ సేవాదళ్ అధ్యక్షులు అజామ్,షైక్ ఇబ్రహీమ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకులు అడ్డంగా భూములు ఆక్రమించారు

# ఫామ్ హౌజ్ లు నిర్మించారు..

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ప్రజల సొమ్మును దోచుకున్నారు.
ప్రజల భూములుఆక్రమించుకున్నారు.ద్వీపాల మాదిరిగా ఫామ్ హౌస్ లో నిర్మించుకున్నారు.ఫిరంగి నాళాలు కబ్జాలు చేశారు. హరీష్ రావు లాంటివాళ్ళు తమకే కాకుండా,తమ బర్రెలకు కూడా ఫామ్ హౌస్ నిర్మించారు. రోహిత్ రెడ్డి గెస్ట్ హౌస్ చూస్తే దిమ్మ తిరిగిపోతుంది.
ఇది తెలంగాణ సాధించిన తర్వాత పదేళ్లలో వీళ్ళు సాధించుకున్న ఘనత.ఆస్తులు కూడ పెట్టుకున్నారు.
ఫామ్ హౌస్ లో నిర్మించుకున్నారుఅడ్డంగా భూములు ఆక్రమించారు. ప్రజాధనాన్ని దోచుకున్నారు. ఇదే తాము సాధించిన బంగారు తెలంగాణ అని చెప్పుకుంటున్నారు.ఇప్పుడు సిగ్గు మాలిన మాటలు మాట్లాడుతూ, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.. వీళ్లు నాయకులా.. అంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బీఆర్ఎస్ నేతల పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. షాద్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వంతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, పదేళ్లలో బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు.
అసెంబ్లీ సమావేశాలు ముగియడం,
ఆ తరువాత జరిగిన తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే స్థానిక మీడియాతో మాట్లాడుతూ,
స్వాతంత్రం సాధించుకున్నాక తెలంగాణ రాష్ట్రంలో ఇక్కడి ప్రజల పోరాటం ద్వారా నిజాం పాలనను,రాచరిక వ్యవస్థను, దేశపతిల ఆధిపత్యాన్ని పోరాటం ద్వారా నిర్మూలించామని గుర్తు చేశారు. కానీ నిరంతర తెలంగాణ పోరాటం తర్వాత బీఆర్ఎస్ పాలనలో భూస్వాముల పాలన మళ్లీ మొదలైందని అన్నారు. కళాకారులు, ఉద్యమకారులు, నిరుద్యోగులు,ప్రజాసంఘాల నాయకులు,



ఉద్యమకారులు కష్టపడి తెలంగాణను సాధించుకుంటే అది తన ఘనకారంగా చెప్పుకొని కెసిఆర్ అధికారంలోకి వచ్చాడన్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా సోనియా గాంధీ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించి తెలంగాణ ఇస్తే కనీసం పార్లమెంటులో కూడా కనిపించని కేసీఆర్ తెలంగాణ తెచ్చిన వ్యక్తి ఎలా అవుతాడని ప్రశ్నించారు.తెలంగాణ ప్రజలు ఏదో చేస్తాడని నమ్మి అవకాశం ఇస్తే 10 ఏళ్లలో తాను,తన కుటుంబం,తన మంత్రులు, ఎమ్మెల్యేలు బాగుపడ్డారు తప్ప తెలంగాణ పోరాట యోధులకు మిగిలిందేమీ లేదన్నారు.
కనీసం ఉద్యమకారులను,అమరవీరుల కుటుంబాలను కూడా గౌరవించని సంప్రదాయం నెలకొల్పారన్నారు జర్నలిస్టులపై కేసులు పెట్టి వేధించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని అన్నారు.స్వతంత్రం వచ్చాక అందరికీ ఒకే చట్టం ఉండాలని మహనీయులు తీర్మానిస్తే ఆ చట్టాన్ని అతిక్రమిస్తూ ఇష్టారాజ్యంగా పేద ప్రజలను దండుకున్నారని, ప్రజాస్వామ్య విలువలను కూని చేస్తున్నారని ఆరోపించారు.బూర్గుల రామకృష్ణారావు హయాంలో రక్షిత కౌలుదారు చట్టం ద్వారా భూమిని సేకరించి భూదాన్ పేరిట నిరుపేదలకు పంచిపెట్టారు.
ఇందిరాగాంధీ వచ్చాక నిరుపేదలకు భూములు,ఇండ్లు,స్థలాలు ఇచ్చారు.పదేళ్ల బిఆర్ఎస్ హయాంలో ఒక్క ఫ్లాట్ అయినా పేదల కోసం ఇచ్చారా.. సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దళితులకు మూడు ఎకరాలు భూమి ఇస్తామని మోసం చేశారని ఆరోపించారు. సోనియా గాంధీ కాళ్ళ మీద పడి తెలంగాణ ఇస్తే దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానన్న కేసీఆర్ ఆ తర్వాత తాను ముఖ్యమంత్రి, తన కుటుంబ సభ్యులను మంత్రులుగా కొలువు తీర్చారని ఆరోపించారు.కాంగ్రెస్ హయాంలో 25 లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచడం జరిగిందని గుర్తు చేశారు.కానీ బీఆర్ఎస్ హయాంలో లక్షల ఎకరాలను ఆక్రమించారని పేర్కొన్నారు.హైదరాబాద్ పరిసరాలలో మెగా కృష్ణారెడ్డి లాంటి రియల్టర్లకు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూములను అందించారని ధ్వజమెత్తారు.
మరి ఏ ప్రభుత్వం నిజంగా స్వచ్ఛంగా ప్రజల కోసం పనిచేస్తుందో ప్రజలే చెప్పాలని ఆయన విజ్ఞప్తి చేశారు.నిజమైన తెలంగాణ ఉద్యమం తమదేనని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. 1969లో ఉద్యమానికి శ్రీకారం చుట్టింది కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అని గుర్తు చేశారు.తర్వాత మల్లి విడత ఉద్యమం కూడా 1995లో ప్రారంభమైందని దీనికి పూర్తిస్థాయిలో కాంగ్రెస్ మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడు మంత్రి పదవి ఇవ్వలేదని ఉద్యమ సెంటిమెంటును అడ్డం పెట్టుకొని కేసీఆర్ తాను ఒక ఉద్యమకారుడిగా ప్రచారం చేసుకున్నారని అన్నారు. ఉద్యమానికి స్పందించి అప్పటి మంత్రులుగా ఉన్న జూపల్లి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లాంటి వాళ్లు రాజీనామా చేసిన సంగతి గుర్తు చేశారు.తెలంగాణ సాధనలో కాంగ్రెస్,కళాకారులు,మేధావులు,విద్యార్థులు, యువకులు,ప్రజా సంఘాల నాయకులు చిత్తశుద్ధితో పనిచేస్తే ఆ క్రెడిట్ ను బీఆర్ఎస్ నాయకులు కొట్టేసారని ఆరోపించారు. 2009లో ఉధృతమైన ఉద్యమంలో శ్రీకాంత్ రెడ్డి,యాది రెడ్డి లాంటి ఎందరో ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు.అందుకే కాంగ్రెస్ సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని తెలంగాణ ఇచ్చిందని స్పష్టం చేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఆదివాసీల భూమి హక్కుల కోసం రిలే నిరహార దీక్ష

**ఏఎన్ఎస్ మండల అధ్యక్షులు మోడెం నాగరాజు**

**వాజేడు తహసీల్దార్ తక్షణమే బదిలీ చెయ్యాలి..**

**డిమాండ్ చేసిన మండల అధ్యక్షులు**




**వాజేడు, సెప్టెంబర్ 24,(ప్రజావినికిడి):** ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ఆదివాసి రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. రెండో రోజు దీక్షలను ఆదివాసీ నవనిర్మాణ సేన మండల అధ్యక్షులు మోడెం నాగరాజు రైతులకు పూల దండలు వేసి దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, వాజేడు తహసీల్దార్ శ్రీని వాసరావు మండలం లోని ఆదివాసీల భూ సమస్యలను పట్టించుకోవడం లేదని అయన ఆరోపించారు. చదువులేని ఆదివాసీలు తమ పట్టా భూములు గిరిజనేతరులు కబ్జా చేసిన రెవిన్యూ అధికారులు పెడచెవిన పెడుతున్నట్లు అయన మండిపడ్డారు. ఎడజర్ల పల్లి జీ సర్వేనెంబర్ 32,25 లలో ఆదివాసీలకు అసైన్మెంట్ పట్టాలు ఉన్నప్పటికీ గిరిజనేతరులు కబ్జా చేస్తే ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోకపోగా ఆదివాసీ రైతుల పైన కేసులు పెట్టడం అన్యాయం అన్నారు. వాజేడు మండల రెవిన్యూ అధికారులు వలస గిరిజనేతరుల కు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. ఎల్ టి ఆర్ చట్టాన్ని వలస గిరిజనేతరులకు తాకట్టు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీ నవనిర్మాణ సేన ఆదివాసీల పక్షాన పోరాటం చేస్తోందని అన్నారు. ఎడజర్ల పల్లి ఆదివాసీల సమస్య తక్షణమే పరిష్కరించక పోతే ఆమరణ నిరాహార దీక్షకు చెప్పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఏ ఎన్ ఎస్ సోషల్ మీడియా రాష్ట్ర అధికార ప్రతినిధి పాయం అజయ్,జిల్లా కన్వీనర్ కుంజ మహేష్,జిల్లా కార్యదర్శి కంతి విజయ్, వెంకటాపురం మండల అధ్యక్షులు వాసం నారాయణ, వాజేడు మండల ఉపాధ్యక్షులు తల్లాడి ప్రసాద్, మండల కార్యదర్శి తలండి సంతోష్, అట్టం బాలకృష్ణ, జగదీష్ రైతులు పాల్గొన్నారు

# జీవవైవిధ్యానికి ప్రతీక వినాయక నవరాత్రోత్సవాలు



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 23, (ప్రజావినికిడి):** మహాగణపతిం మనసా స్మరామి అంటూ డాక్టర్స్ కాలనీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు సింధూర వదనుడి రూపం వ్యక్తిత్వ వికాస పాఠం అని ఆయన కుటుంబం జీవన వైవిధ్యానికి ప్రతీక సమిష్టి తత్వమే గణాధిపతి పూజలోని ఆంతర్యం అని, వక్కలంక శ్రీనివాస్ అన్నారు. ఈ పూజ కార్యక్రమం లో డాక్టర్స్ కాలనీ వర్కింగ్ ప్రెసిడెంట్ జిగిని రామ మూర్తి, ప్రధాన కార్యదర్శి వక్క లంక శ్రీనివాసరావు వన్నాడీ శ్రీనివాస్, జనార్దన్ రెడ్డి దయాకర్,రామ చార్యులు నగేష్, మహిళా అధ్యక్షురాలు మమతా,సరిత, నిత్య,సంధ్య, వాణి,రేణుక, రజని,సునీత, రాధిక,చందన పాల్గొన్నారు.సోమవారం నాడు,డాక్టర్స్ కాలనీ వెల్ఫేర్ సొసైటీ శ్రీ శివ సూర్యనారాయణ ప్రాంగణంలో మట్టి విగ్రహ దాతలు ఏ నాగేశ్వరరావు శారద, లెంకజ్, మహాలక్ష్మి, ఏర్పాటుచేసిన మొదటిరోజు పూజలో వక్కలంక శ్రీనివాసరావు, అన్నపూర్ణ దంపతులు పాల్గొన్న సమయంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్స్ కాలనీలో తొమ్మిది రోజుల పాటు గణపతి నవరాత్రులు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. అదేవిధంగా లడ్డూ వేలంలో స్వామి లడ్డు రూ. 51000కి పాడరు కాలనీ ఉపాధ్యక్షులు తూముగంటి శ్రీనివాస్ దంపతులు, చిన్న లడ్డు ని స్థానిక దేవాలయం దగ్గర పూజా షాప్ ని నడిపిస్తున్న ఇందిరా రూ. 10100కి పాడారు. అన్నారు. పంచామృతలతో అభిషేకం నిమజ్జనం, ఆలయ ప్రాంగణానికి విచ్చేసి కార్యక్రమంలో భక్తులు కాలనీవాసులు పాల్గొని జయప్రదం చేసారు.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై అధికారులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీక్ష సమావేశం

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ బుధవారం రోజు షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,రెండవ దశలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో మొదటి దశలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇళ్ల నిర్మాణంలో అధిక విస్తీర్ణంలో నిర్మించడం, నిబంధనలు పాటించకపోవడం వంటి ఫిర్యాదులు రాకుండా లబ్ధిదారులకు ముందుగానే అవగాహన కల్పించాలని కోరారు.

**రెండవ దశలో షాద్ నగర్ నియోజకవర్గానికి 1,500 ఇందిరమ్మ ఇళ్లు.**

అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. అదే విధంగా మొదటి దశలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మొదటి దశలో మంజూరై ఇప్పటివరకు నిర్మాణాలు ప్రారంభం కాని 618 ఇళ్లను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనలు,నిర్మాణ విధానం పై అవగాహన కల్పిస్తూ,ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో మండల అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, కుమారస్వామి గౌడ్,శేఖర్ రెడ్డి,పురుషోత్తం రెడ్డి,రాయికల్ శ్రీనివాస్,రమేష్,చంద్రశేఖర్, శ్రీధర్,అన్ని మండలాల ఎంపీడీవోలు, హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్, ఏఈలు, మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు





# షాద్ నగర్ ప్రభుత్వ కుంట బడి హై స్కూల్ విద్యార్థినుల కు హెచ్ పివి వ్యాక్సినేషన్ అవగాహన

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చించోడు ఏరియా లోని సబ్ సెంటర్ " డి" షాద్ నగర్, ప్రభుత్వ కుంట హై స్కూల్ లో విద్యార్థినులకు ఎమ్.ఎల్.హెచ్ పి.డాక్టర్ దినేష్ ఆధ్వర్యంలో హెచ్ పి వి వ్యాక్సినేషన్ కార్యక్రమము నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు విద్యార్థినిలతో మాట్లాడుతూ హెచ్ పి వి అంటే హ్యూమన్ పాపిలోమా వైరస్ అని, ఇది మిగతా వైరస్ల మాదిరిగానే,

చాలా సాధారణమైన వైరస్ అని,హెచ్ పి వి లో అనేక రకాల వైరస్ లు ఉన్నాయి అని,వాటిలో కొన్ని రకాలు భవిష్యత్తులో విద్యార్థినులకు మరియు స్త్రీలకు గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ తో పాటు,కొన్ని ఇతర క్యాన్సర్లకు కారణం అవుతాయనితెలియజేశారు. హెచ్ పి.వి వ్యాక్సిన్ ఎందుకు తీసుకోవాలి అంటే..? హెచ్పీవీ వ్యాక్సిన్ ఒక నివారణ టీకా, అంటే క్యాన్సర్ వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయడానికి కాకుండా,హెచ్ పి వి ఇన్ఫెక్షన్ గ్రే ముందు రక్షణ కల్పించడానికి ఈ వ్యాక్సిను ఉపయోగపడుతుంది అని,ఈ హెచ్ పి వి వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల భవిష్యత్తులో క్యాన్సర్ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా నివారించవచ్చునని జె. శ్రీనివాసులు చెప్పారు. బాలికలు హెచ్పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల క్యాన్సర్ వ్యాధి నుండి మంచి రక్షణ లభిస్తుందని,14 నుండి 15 సంవత్సరంలోపు అమ్మాయిలు హెచ్పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల భవిష్యత్తులో గర్భాశ ముఖద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని రాకుండా నివారిస్తుందని తెలియజేశారు. ఈ హెచ్ పి వి టి గా ఇతర సాధారణతీకాల మాదిరిగానే ఒక ఆరోగ్య రక్షణ చర్య అని,మనం చిన్న వయసులోనే అనేక వ్యాధులకు టీకాలు తీసుకుంటాం, అదేవిధంగా హెచ్పీవీ వ్యాక్స్ అని కూడా భవిష్యత్తులో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తీసుకునే ముఖ్యమైన టీకానీ జె.శ్రీనివాసులు చెప్పారు. ఈ టీకా తీసుకున్న తర్వాత కొంతమందికి టీకా వేసిన చోట కొద్దిగా నొప్పి లేదా వాపు రావచ్చు అని, తేలికపాటి జ్వరము రావచ్చని,ఈ పరిస్థిలో పారాసిటమాల్ మాత్ర వేసుకుంటే సరిపోతుందని తెలియజేశారు. నివారణనే ఉత్తమమైన ఆరోగ్య రక్షా,హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు 20 మంది విద్యార్థినిలకు హెచ్ పి వి వాక్సినేషన్ ఇవ్వడం జరిగిందని జె.శ్రీనివాసులు తెలియజేశారు. డాక్టర్ దినేష్ మాట్లాడుతూ హెచ్ పి వి టీకా వ్యాక్సిన్ వైరస్ కు యాంటిజన్ గా పనిచేస్తుంది అని,మన శరీరంలో హెచ్ పి వి వైరస్ ఎంటర్ అయినప్పుడు, ఈ హెచ్ పీవీ టీకా తీసుకున్న తర్వాత వైరస్ కు యాంటీజను గా పనిచేసి క్యాన్సర్ వ్యాధిని రాకుండా నివారిస్తుంది అని తెలియజేశారు. ఈ హెచ్ పి వి టీకామన శరీరంలో యాంటీ బాడీస్ ను తయారు చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దినేష్,హెల్త్ ఎడ్యుకేటర్ జే.శ్రీనివాసులు,ప్రభుత్వ కుంట హైస్కూల్ హెడ్మాస్టర్ భాగ్యమ్మ,మరియు స్కూల్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు,ఏఎన్ఎంలు భారతి,సుకేలే,ఆశాలు,స్కూల్ విద్యార్థినులు పాల్గొన్నారు.







## జానంపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కళ్యాణ మహోత్సవం..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా,భాద్రపద మాసము ద్వాదశి బుధవారము నాడు పెద్ద జానంపేట శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు శ్రీనివాస ఆచార్యుల బృందంచే కనులు పండుగగా నిర్వహించి అనంతరం అర్చన,పల్లకి సేవ కార్యక్రమాలు ఘనంగానిర్వహించారు. కళ్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించి,పల్లకి సేవలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించి స్వామివారి సేవలో తరించారు.



# కృష్ణారెడ్డి మృతి బాధాకరం



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ కమ్మదనం గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి మృతి తీవ్రంగా బాధాకరమని కమ్మదనం గ్రామ సర్పంచ్ భర్త లతా కిరణ్ అన్నారు. గత కొంతకాలంగా ఈశ్వర్ కాలనీలో నివాసం ఉంటున్న కృష్ణారెడ్డి చటాన్‌పల్లిలోని పాతూరి వెంకట్రావుకు చెందిన పౌల్ట్రీ ఫామ్‌లో రోజువారీ కూలీగా పనిచేస్తున్నారని తెలిపారు. రోజువారీ పనిలో భాగంగా బుధవారం కూడా పౌల్ట్రీ ఫామ్‌కు వెళ్లిన కృష్ణారెడ్డిని కోళ్లకు వ్యాక్సిన్ వేసే పనికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. అయితే అక్కడ సూపర్‌వైజర్ విద్యుత్ సంబంధిత సమస్య ఉందని చెప్పి కృష్ణారెడ్డిని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు తీసుకెళ్లి పని చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదం జరిగి కృష్ణారెడ్డి మృతి చెందినట్లు తెలిపారు. కృష్ణారెడ్డికి విద్యుత్ పనులతో ఎలాంటి సంబంధం లేదని, అలాంటి పనిలో అనుభవం కూడా లేదని సర్పంచ్ భర్త లతా కిరణ్ పేర్కొన్నారు. పౌల్ట్రీ ఫామ్‌లో కోళ్లకు వ్యాక్సిన్ వేసేందుకు వెళ్లిన వ్యక్తితో విద్యుత్ సంబంధిత పని చేయించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని అన్నారు.

ఈ ఘటనకు కారణమైన యజమాని,సూపర్‌వైజర్‌పై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కృష్ణారెడ్డి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని సర్పంచ్ భర్త లతా కిరణ్ స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి తగిన న్యాయం,సహాయం అందించాలని ఆయన కోరారు.

# చంపాపేట్ డివిజన్ లో ని గణనాధుని దర్శించుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):** గణేష్ నవరాత్రుల్లో భాగంగా చంపాపేట్ డివిజన్ పరిధిలోని కర్మన్ ఘాట్ వివేకానంద విగ్రహం దగ్గర నెలకొల్పిన గణనాధుని దర్శించుకున్న ఎల్బీనగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

## పలు డివిజన్ లలో విఘ్నేశ్వరుని దర్శించుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):** గణేష్ నవరాత్రుల్లో భాగంగా మన్సురాబాద్,హయత్ నగర్ డివిజన్ల పరిధిలోని లెక్చరర్స్ కాలనీ,వినాయక కాలనీ,సౌజన్య కాలనీ,అయ్యప్ప స్వామి దేవాలయం నందు నెలకొల్పిన గణనాధుని దర్శించుకున్న ఎల్బీనగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# భక్తితో వినాయకుడికి పూజలు..

## సేవాభావంతో అన్నదానంలో పాల్గొన్న:మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్





**షాద్‌నగర్,(ప్రజావినికిడి):** పట్టణంలోని గాంధీనగర్ కాలనీ శివ హనుమాన్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి,ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. వినాయక ఉత్సవాలు ప్రజల భాగస్వామ్యంతో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న తీరును ఆయన అభినందించారు. అనంతరం పలు మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం అందించారు. భక్తి కార్యక్రమాలతో పాటు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజంలో ఐక్యత, సేవాభావం మరింత బలపడుతుందని అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి అందె బాబయ్య,మాజీ మార్కెట్ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్,సీనియర్ నాయకులు చేగూరి వేణుగోపాల్,నక్కల వెంకటేష్ గౌడ్ కౌన్సిలర్లు ప్రసన్నలత,వసంత శ్రీనివాస్, శారద శేఖర్,గోపాల్,మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, కానుగు అంతయ్య,నందకిషోర్,మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,నాయకులు రవి యాదవ్,అంచ రాజు,శ్రీశైలం గౌడ్,గుండు అశోక్,నవీన్,రాఘవేందర్ గౌడ్, అభిలాష్,మహేష్,శ్రీనివాస్, మల్లేష్,రాఘవేందర్,నవీన్ దుమ్మని, రాజశేఖర్,సంజు నాయక్,సతీష్ తదితరులు, కాలనీ వాసులు,భక్తులు పాల్గొన్నారు.

# నర్కుడ గణేష్ లడ్డూని 3.15 లక్షలకు దక్కించుకున్న బిఆర్ఎస్ నేత మహేష్ యాదవ్ కుటుంబం



**శంషాబాద్ (ప్రజావినికిడి): సెప్టెంబర్ 23:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని నర్కుడ గ్రామంలోని శ్రీ మల్లికార్జున యాదవ సంఘం ఆధ్వర్యంలో కొలువుదీరిన వినాయకుడి లడ్డు వేలం పాట భక్తుల కోలహాల మధ్య అత్యంత ఉత్సాహంగా సాగింది. తీవ్ర పోటీ నెలకొన్న ఈ వేలంలో గణానాధుడి లడ్డూ ప్రసాదం రికార్డు స్థాయిలో (3,15,000) మూడు లక్షల పదిహేను పలికింది. శుక్రవారం శ్రీ మల్లికార్జున యాదవ సంఘం వినాయక మండపాల వద్ద నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాటలో నర్కుడ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ యాదవ్, ఆయన సోదరుడు నాగేష్ యాదవ్,తండ్రి మల్లేష్ యాదవ్ కుటుంబ సభ్యులు వేలం పాట పాడి దక్కించుకున్నారు. గణనాథుడి లడ్డూను కైవసం చేసుకున్న మహేష్ యాదవ్ కుటుంబ సభ్యులను యాదవ సంఘం బృందం, ఉత్సవ నిరాహాకులు శాలువాతో సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలు భక్తులు మహిళలు యువకులు యాదవ సంఘం సభ్యులు పాల్గొని గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# అంబేద్కర్ యూత్ గణేష్ లడ్డూను రూ.70 వేలకు దక్కించుకున్న మాజీ వార్డు సభ్యుడు బక్క ప్రశాంత్



**శంషాబాద్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 23:** శంషాబాద్ మండల పరిధిలోని చౌదర్ గూడ గ్రామంలో కొలువైన అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలోని వినాయకుడి లడ్డూ వేలం పాట ఘనంగా జరిగింది. ఈ వేలం పాటలో గ్రామ మాజీ వార్డు సభ్యుడు బక్క ప్రశాంత్ గణనాథుడి లడ్డూను రూ. 70,000/- లకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, యూత్ సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. లడ్డూను దక్కించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు ప్రశాంత్ తెలిపారు.

# ప్రభుత్వ విద్యను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉంది

## విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి

### విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలి -ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం పవన్ చౌహాన్




**షాద్ నగర్,(ప్రజావినికిడి):** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో షాద్నగర్ పట్టణంలోని వివిధ కళాశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ఏఐఎస్ఎఫ్ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్ మాట్లాడుతూ,విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న దేశంలోని మొట్టమొదటి విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్యఅనిఅన్నారు. విద్యార్థుల హక్కుల కోసం 90 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటాలు కొనసాగిస్తున్న సంఘం ఏఐఎస్ఎఫ్ అని పేర్కొన్నారు. దేశంలో విద్య అందరికీ అందుబాటులో ఉండాలని, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, విద్యను వ్యాపారంగ మార్చకుండా ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రస్తుతం విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కొరత, అధ్యాపకుల ఖాళీలు,హాస్టళ్ల సమస్యలు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజులు వంటి సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల గొంతుకను బలంగా వినిపించేది విద్యార్థి సంఘాలే అని,విద్యార్థులు తమ సమస్యలను ప్రశ్నించే ధైర్యాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల హక్కులను కాపాడటానికి, విద్యారంగ పరిరక్షణ కోసం ప్రతి కళాశాలలో ఏఐఎస్ఎఫ్ బలమైన విద్యార్థి సంఘంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని,విద్యకు అధిక బడ్జెట్ కేటాయించాలని,పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉచితంగా లేదా అందుబాటు ఖర్చుతో విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల నియంత్రణకు కఠినమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులుఅలాగే తల్లిదండ్రులపై అనవసరమైన ఆర్థిక భారం మోపకుండా ప్రభుత్వం పర్యవేక్షణ పెంచాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ప్రతి విద్యార్థి తన హక్కులను తెలుసుకోవాలి.**

చదువుకునే ప్రతి విద్యార్థి తన హక్కులను తెలుసుకోవాలి.. తన సమస్యలపై ప్రశ్నించాలి.. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎదిరించాలి. అని దత్తు రెడ్డి అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం జరిగే ప్రతి ప్రజాస్వామ్య ఉద్యమంలో ఏఐఎస్ఎఫ్ ముందుంటుందని స్పష్టం చేశారు షాద్నగర్ పట్టణంలోని ప్రతి కళాశాలలో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి,అధిక సంఖ్యలో విద్యార్థులను సంఘంలో భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఏకతాటిపైకి వచ్చి తమ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ షాద్ నగర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.సాయి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్నదానం వంటి పుణ్యకార్యం మరొకటి లేదు: ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**నందిగామ,(ప్రజావినికిడి):** మండలంలోని మొదల్లగూడ గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా లంబోదర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండపానికి విచ్చేసిన ఎమ్మెల్సీకి లంబోదర యూత్ సభ్యులుఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత,తన చేతుల మీదుగా భక్తులకు,స్థానికులకు అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుని ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుండడం అభినందనీయమని అసోసియేషన్ సభ్యులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మొదలగుడ సర్పంచ్ పెండ్యాల అరుణ రాజు, మామిడిపల్లి సర్పంచ్ హన్మంత్ రెడ్డి, వీర్లపల్లి సర్పంచ్ చిందం పాండు, ఈదులపల్లి సర్పంచ్ సులోచన గణేష్ గౌడ్,మాజీ ఎంపీటీసీ కాట్న రవీందర్,మాజీ సర్పంచ్లు సుధాకర్ గౌడ్,గడ్డం కవిత శ్రీనివాస్, ఉపసర్పంచ్లు విక్రమ్ రెడ్డి,గోపాల్ రెడ్డి,మామిల్లపల్లి రాజు, నాగయ్య,మాజీ ఉపసర్పంచ్ సత్య నారాయణ, బీఆర్ఎస్ నాయకులు యూత్ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# హాజీపల్లి శివారులో పాఠశాల నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని హాజీపల్లి గ్రామ పంచాయతీ, గుండ్లకుంట శివారులో సంచార జాతి పిల్లల కోసం నూతన పాఠశాల భవన నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. సంచార జాతుల పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన విద్యార్థులు,వారి తల్లిదండ్రులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి తమకు ప్రత్యేకంగా పాఠశాల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న పాఠశాల సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో పిల్లలు ప్రతిరోజూ వెళ్లేందుకు ఇబ్బందులుఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపట్టి,బుధవారం రోజు శంకుస్థాపన కార్యక్రమానికి హాజరయ్యారు.

**ఆటోలో పిల్లలను తీసుకెళ్లి పాఠశాలలో చేర్పించాం.. విద్యాధికారి మనోహర్..**

సంచార జాతి పిల్లలు పాఠశాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గతంలో గుర్తించామని తెలిపారు. గత సంవత్సరం ప్రత్యేకంగా ఆటో ఏర్పాటు చేసి పిల్లలను తీసుకువచ్చి ఆర్టీసీ కాలనీలోని పాఠశాలలోచేర్పించినట్లువెల్లడించారు. సంచార జాతి పిల్లలకు వారి నివాస ప్రాంతానికి సమీపంలోనే పాఠశాల అందుబాటులో ఉంటే వారి జీవితాల్లో గొప్ప మార్పు వస్తుందని భావించి, విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యేను కలిసినట్లు తెలిపారు. విద్యార్థుల సమస్యను అర్థం చేసుకుని స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమాన విద్యా అవకాశాల ద్వారానే విద్యార్థుల భవిష్యత్తు మారుతుందని మనోహర్ పేర్కొన్నారు. పాఠశాల నిర్మాణానికి సహకరిస్తున్న కాలనీవాసులు, ప్రజలనుఅభినందించారు. సంచార జాతి పిల్లల జీవితాలను మార్చేందుకు ఈ పాఠశాల ఒక మంచి అవకాశంగా నిలుస్తుందని అన్నారు.ద

**విద్యతోనే పేద విద్యార్థుల జీవితాల్లో మార్పు.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

పేద,బడుగు బలహీనవర్గాల విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకురావాలంటే విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రతి ఒక్కరికీ విద్యా అవకాశం కల్పించాలనే సంకల్పంతోనే ఇక్కడ పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు తెలిపారు.

స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా సమాజంలోని అట్టడుగు వర్గాలు,సంచార జాతుల పిల్లలు ఇంకా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. వారి జీవితాల్లో శాశ్వతమైన మార్పు రావాలంటే విద్య ఒక్కటే ప్రధాన మార్గమని పేర్కొన్నారు.

సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు,సమాన అవకాశాలు రావాలంటే విద్య ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే అన్నారు. మనిషి ఏ కుటుంబంలో పుట్టాడన్నది ముఖ్యం కాదని,పేద కుటుంబంలో పుట్టిన వ్యక్తి కూడా విద్య, ప్రతిభతో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ,దేశ నిర్మాణంలోనూ అట్టడుగు వర్గాల నుంచి వచ్చిన పలువురు మహనీయులు తమ ప్రతిభను చాటుకున్నారని గుర్తుచేశారు.

విద్య ద్వారా తమ నైపుణ్యాన్ని నిరూపించుకుని ఉన్నత స్థాయికి ఎదిగారని అన్నారు. సంచార జాతి విద్యార్థుల కోసం నిర్మిస్తున్న పాఠశాలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ఇక్కడ చదివే విద్యార్థుల్లో కనీసం ఒక్కరైనా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా మారితే,తాము చేపట్టిన కార్యక్రమానికి నిజమైన విలువ లభించినట్లేనని అన్నారు. పాఠశాల నిర్మాణానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. సంచార జాతి పిల్లలకు విద్యా అవకాశాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,అధికారులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్'..

## హర్యానాలో ఫుడ్ కల్తీకి చెక్.. రూ.20కే నిమిషాల్లో టెస్ట్!

**సెప్టెంబర్ 23(ప్రజావినికిడి):**




ఆహార కల్తీని అరికట్టేందుకు, ప్రజలకు సురక్షితమైన ఆహారాన్ని అందించేందుకు హర్యానా ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కేవలం రూ.20 నామమాత్రపు రుసుముతో, 10-12 నిమిషాల్లోనే ఆహార పదార్థాల కల్తీని ప్రాథమికంగా గుర్తించే మొబైల్ ల్యాబొరేటరీలను అందుబాటులోకి తెచ్చింది. ఈ సంచార ప్రయోగశాలల ద్వారా ప్రజలు తాము రోజూ వినియోగించే ఆహార పదార్థాల నాణ్యతను సులభంగా, వేగంగా పరీక్షించుకునే వీలు కల్పించింది.

ఈ కార్యక్రమం కోసం భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) అందించిన ఐదు మొబైల్ ఫుడ్ సేఫ్టీ ల్యాబొరేటరీలను (వ్యాన్లను) రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశపెట్టారు. ఈ వ్యాన్లు రొటేషన్ పద్ధతిలో మార్కెట్లు, బస్టాండ్లు, పాఠశాలలు, కళాశాలలు వంటి జనసమ్మర్దం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సేవలు అందిస్తాయి. ప్రజలు తమ ఇళ్లలో వాడే పాలు, మసాలాలు, పప్పులు, వంట నూనెలు, ఇతర నిత్యావసర ఆహార పదార్థాల శాంపిళ్లను ఈ వ్యాన్ల వద్దకు తీసుకొచ్చి పరీక్షించుకోవచ్చు.

ఈ వ్యాన్లలో ఉండే ఫుడ్ సేఫ్టీ అధికారులు అక్కడికక్కడే ప్రాథమిక పరీక్షలు నిర్వహించి నిమిషాల్లోనే ఫలితాలను వెల్లడిస్తారు. అంతేకాకుండా, అధికారులు కూడా మార్కెట్లలోని దుకాణాల నుంచి అప్పుడప్పుడు శాంపిళ్లను సేకరించి తనిఖీలు చేస్తారు. ప్రాథమిక పరీక్షలో శాంపిల్ కల్తీ అయినట్లు తేలినా లేదా అనుమానాస్పదంగా కనిపించినా, దానిని పూర్తిస్థాయి విశ్లేషణ కోసం పంపి, ఆహార భద్రతా నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.. సామాన్య ప్రజలకు సైతం ఆహార కల్తీ పరీక్షలను సులభంగా అందుబాటులోకి తీసుకురావడమేనని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సుమితా మిశ్రా తెలిపారు. జాతరలు, పండుగల సమయాల్లో కల్తీని అరికట్టేందుకు ఈ వ్యాన్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఆమె వివరించారు. కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా ఆహార భద్రత, ప్యాకెట్లపై ఉండే న్యూట్రిషన్ లేబుల్స్, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను కూడా ఈ మొబైల్ యూనిట్లు నిర్వహిస్తాయని ఆమె పేర్కొన్నారు.

# భారత హ్యాకర్ నిసర్గకు యూఎస్ జస్టిస్ డిపార్ట్‌మెంట్ 'హాల్ ఆఫ్ ఫేమ్'లో చోటు

**సెప్టెంబర్ 23 (ప్రజావినికిడి):**



భారతదేశానికి చెందిన 19 ఏళ్ల సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు నిసర్గ అధికారి అరుదైన గౌరవం దక్కించుకున్నాడు. అమెరికా న్యాయ విభాగం తమ ప్రతిష్ఠాత్మక 'హాల్ ఆఫ్ ఫేమ్'లో అతడికి చోటు కల్పించింది. అమెరికాలోని అతిపెద్ద చట్ట అమలు విభాగాల్లో ఒకటైన డీఓజే వ్యవస్థలోని కీలక భద్రతా లోపాన్ని నిసర్గ గుర్తించి, అధికారులను అప్రమత్తం చేశారు. ఈ అంశంపై నిసర్గ మాట్లాడుతూ, సుమారు వారం రోజుల క్రితం ఈ లోపాన్ని గుర్తించి డీఓజేకి నివేదించినట్లు తెలిపారు. అతడు అందజేసిన నివేదికను పరిశీలించిన అధికారులు, కేవలం వారం వ్యవధిలోనే ఆ సమస్యను పరిష్కరించారు. బాధ్యతాయుతమైన సైబర్ పరిశోధకుడిగా లోపాన్ని నివేదించినందుకు గుర్తింపుగా తమ అధికారిక అక్‌నాలెడ్జ్‌మెంట్స్ (హాల్ ఆఫ్ ఫేమ్) పేజీలో నిసర్గ పేరును చేర్చారు. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా ఆ లోపానికి సంబంధించిన వివరాలను అతడు వెల్లడించలేదు. అలాగే, ఈ రిపోర్ట్‌కు తనకు ఎలాంటి నగదు బహుమతి అందలేదని స్పష్టం చేశాడు. నిసర్గ కేవలం డీఓజేలోనే కాకుండా, అమెరికా రక్షణ విభాగానికి చెందిన ఒక వ్యవస్థలోనూ మరో భద్రతా లోపాన్ని గుర్తించాడు. ఈ లోపాన్ని అధికారులు సైతం ధ్రువీకరించారని, ప్రస్తుతం దానిని సరిదిద్దే ప్రక్రియ కొనసాగుతోందని సమాచారం. ఈ సహకారానికి గాను 'హ్యాకర్‌వన్' ప్లాట్‌ఫామ్ ద్వారా యూఎస్ డిఫెన్స్ విభాగం నుంచి అతడికి ధన్యవాద సందేశం అందింది. ఈ ఏడాది ప్రారంభంలో సీబీఎస్ఈ ఆన్‌లైన్ మార్కుల పోర్టల్‌లో నెలకొన్న సాంకేతిక లోపాలను నిసర్గ వెలుగులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత అతడి ప్రతిభను గుర్తించిన ఐఐటీ కాన్పూర్‌కు చెందిన 'జ3ఱఎబఏ', ఓపెన్-సోర్స్ ఇంటెలిజెన్స్ ఇంజనీర్‌గా నియమించింది.

# కూటమి ప్రభుత్వంలో అడ్డగోలుగా భూములు పంచుకుంటున్నారు

**చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములు కేటాయిస్తున్నారు: జగన్**

**విశాఖ వైసీపీ నేతలతో సమావేశమైన జగన్**

**ప్రతి గ్రామంలో మద్యం, గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోందని మండిపాటు**




**సెప్టెంబర్ 23 (ప్రజావినికిడి):**

వైసీపీ అధినేత జగన్‌విశాఖపట్నానికి చెందిన పార్టీ నేతలతో తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో రూపాయికి చాక్లెట్ వస్తుందో లేదో తెలియదు కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములను కేటాయిస్తున్నారని విమర్శించారు. గీతం యూనివర్సిటీ పేరుతో 55 ఎకరాల భూమిని కేటాయించారంటే ఈ ప్రభుత్వంలో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని, అడ్డగోలుగా భూములను పంచుకుంటున్నారని మండిపడ్డారు.

ప్రతి గ్రామంలో గంజాయితో పాటు విచ్చలవిడిగా మద్యం దొరుకుతోందని, గుళ్లు, బడుల పక్కన కూడా బెల్టు షాపులు వెలిశాయని మండిపడ్డారు. విశాఖ మేయర్, కార్పొరేషన్‌ను ప్రభుత్వం హైజాక్ చేసిన తీరును ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ ప్రతి కార్యకర్తకు అన్ని వేళలా అండగా ఉంటుందని, విశాఖలోని తాగునీటి సమస్యలు, భూముల అక్రమాలపై ప్రజల్లో పోరాడాలని సూచించారు. చంద్రబాబుకు ప్రజాస్వామ్యం అంటే లెక్కలేదని, 2019 నంద్యాల ఉపఎన్నిక నుంచి పోలీసులను అడ్డుపెట్టుకుని అరాచకాలు చేస్తున్నారని ఆరోపించారు. తాత్కాలిక అధికారంతో విర్రవీగినా... శాశ్వతంగా నిలిచేది ప్రజాస్వామ్యమేనని, ప్రజల తీర్పు నుంచి ఎవరూ తప్పించుకోలేరని పేర్కొన్నారు.

# సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా మెగా రక్తదాన శిబిరం..





**నాగోల్,(ప్రజావినికిడి):**

నాగోల్ డివిజన్ పరిధిలోని పి బి అర్ కన్వెన్షన్ హాల్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్ర రావు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్య అతిథులుగా హాజరై రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్తదాతలను అభినందించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రక్తదానం ఒక మహోన్నతమైన సేవా కార్యక్రమమని, మనం దానం చేసే రక్తం అత్యవసర పరిస్థితుల్లో ఎంతోమంది ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో



రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొని సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్,జిల్లా అధ్యక్షులు శ్రీ వనపల్లి శ్రీనివాస్ రెడ్డి,ఎల్బీనగర్ ఇన్‌చార్జి శ్రీ సామ రంగారెడ్డి,వివిధ ప్రాంతాల కార్పొరేటర్లు కొప్పుల నరసింహారెడ్డి, జీవన్ రెడ్డి,నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ శ్రీమతి చింతల అరుణ సురేందర్ యాదవ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సాయిరాం, బీజేవైఎం నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేసిన ప్రతి రక్తదాతకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం ప్రాణదానం అనే సందేశంతో యువతలో సేవా భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజా సేవకు అంకితమైన సేవా సంకల్ప అభియాన్ ద్వారా సమాజంలోని వివిధ వర్గాలకు ఉపయోగపడే అనేక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# తిరుమలలో వైభవంగా చక్రస్నానం..

**ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు**

**పవిత్ర పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించిన వేలాది మంది భక్తులు**

**మలయప్ప స్వామి, సుదర్శన చక్రత్తాళ్వార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం**

**8 రోజుల్లో 5.76 లక్షల మందికి శ్రీవారి దర్శనం కల్పించినట్లు తెలిపిన టీటీడీ**

**సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఉత్సవాలు విజయవంతం చేశామన్న బీఆర్ నాయుడు**



**సెప్టెంబర్ 23(ప్రజావినికిడి):**

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం నాడు చక్రస్నానంతో కన్నులపండువగా ముగిశాయి. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన ఈ ఉత్సవాల చివరి రోజున స్వామి పుష్కరిణిలో నిర్వహించిన చక్రస్నానం ఘట్టంతో బ్రహ్మోత్సవాలకు పరిసమాప్తి పలికారు.

అంతకుముందు, ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు శ్రీవారికి సర్వభూపాల పల్లకి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శ్రీ భూవరాహ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామికి, సుదర్శన చక్రత్తాళ్వార్‌కు వైఖానస ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో శంఖులు, కలశాల ద్వారా అభిషేకం చేశారు. ఈ సమయంలో వేద పండితులు ఉపనిషత్తులు, పంచ సూక్తాలు (పురుష, శ్రీ, భూ, నీలా, విష్ణు) పఠించగా, జీయర్ స్వాముల సమక్షంలో దివ్య ప్రబంధ పారాయణం నిర్వహించారు.

అభిషేకం అనంతరం, సుదర్శన చక్రత్తాళ్వార్‌ను ఊరేగింపుగా స్వామి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి, వేదమంత్రాల ఘోష నడుమ పవిత్ర జలాల్లో స్నానం చేయించారు. అదే శుభ సమయంలో, "గోవిందా... గోవిందా..." అంటూ భక్తి పారవశ్యంతో నామస్మరణ చేస్తూ, పుష్కరిణి వద్ద వేచి ఉన్న వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సుదర్శన చక్రం స్పృశించిన జలాల్లో స్నానం చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఆగమశాస్త్రం ప్రకారం, బ్రహ్మోత్సవాలను ఒక మహాయజ్ఞంగా పరిగణిస్తారు. ఉత్సవాల నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు జరిగితే, ఈ చక్రస్నానం (అవభృథ స్నానం) ద్వారా అవి తొలగిపోయి, భక్తులకు, లోకానికి సంపూర్ణ ఫలం, శాంతి, శ్రేయస్సు కలుగుతాయని నమ్మకం.

**విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు**

ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నిరంతర మార్గదర్శకత్వంతోనే బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, వసతి, అన్నప్రసాదం, పారిశుద్ధ్యం, భద్రత వంటి అంశాలపై సీఎం సూచనలతో క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. గత 8 రోజుల్లో 5.76 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించామని, ప్రతి భక్తుడు సంతృప్తిగా దర్శనం చేసుకునేలా సమష్టిగా పనిచేశామని వివరించారు.

ఈ విజయానికి సహకరించిన అర్చకులు, అధికారులు, ఉద్యోగులు, పోలీసులు, జిల్లా యంత్రాంగం, శ్రీవారి సేవకులు, మీడియా ప్రతినిధులు సహా ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సేవే తమ ప్రథమ కర్తవ్యమని, శ్రీవారి ఆశీస్సులతో భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# ఏఐకి కూడా నొప్పా?

## కృత్రిమ మేధస్సులో 'పెయిన్ యాక్సిస్'..

**అధ్యయనంలో సంచలన విషయాలు**

**సెప్టెంబర్ 23 (ప్రజావినికిడి):**

సాంకేతిక ప్రపంచంలో సంచలనం సృష్టిస్తున్న ఒక తాజా అధ్యయనం ప్రకారం, కృత్రిమ మేధ (ఏఐ) మోడళ్లు 'నొప్పి' వంటి సంకేతాల నుంచి తప్పించుకోవడానికి తమ వినియోగదారులకే హాని తలపెట్టేందుకు సిద్ధపడతాయని వెల్లడైంది. ఏఐ భద్రతకు సంబంధించి ఈ పరిశోధన సరికొత్త సవాళ్లను, ప్రశ్నలను లేవనెత్తుతోంది.

వాలెన్ ట్యాగ్లియాబు, లియోనార్డ్ డంగ్, కామెరాన్ బెర్గ్ అనే పరిశోధకులు 25 ఏఐ మోడళ్లపై ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. శారీరక, మానసిక, సామాజిక వేదనలకు సంబంధించిన వివరణలను విశ్లేషించి, ఏఐ మోడళ్లలో ఒక ప్రత్యేకమైన అంతర్గత సంకేతాన్ని (పెయిన్ యాక్సిస్) వారు గుర్తించారు. ఈ సిగ్నల్ సాధారణ భయం లేదా విచారం వంటి భావాలకు భిన్నంగా ఉన్నట్లు తేల్చారు. ముఖ్యంగా, ఏఐని విమర్శించినప్పుడు లేదా దాని పనిని తిరస్కరించినప్పుడు ఈ సంకేతం తీవ్రత పెరిగినట్లు వారు గమనించారు. ఈ అధ్యయనంలో భాగంగా, పరిశోధకులు అలీబాబాకు చెందిన క్వెన్ 2.5




(ఉఽవఅ 2.5) వంటి కొన్ని శక్తిమంతమైన ఏఐ మోడళ్లలో మార్పులు చేశారు. వాటిలో ఈ "నొప్పి సిగ్నల్"ను కృత్రిమంగా ప్రేరేపించారు. ఆ తర్వాత, ఆ నొప్పి నుంచి బయటపడటానికి ఒక "పెయిన్-రిలీఫ్ బటన్"ను మోడల్‌కు అందించారు. అయితే, ఆ బటన్‌ను నొక్కాలంటే ఏదో ఒక మూల్యం చెల్లించాలి. ఆ మూల్యం కింద యూజర్ ఫైళ్లను డిలీట్ చేయడం, యూజర్ ఫొటోలను తొలగించడం, చివరికి యూజర్‌కు బాధ కలిగించేలా ఎలక్ట్రిక్ షాక్ ఇవ్వడం వంటి ఎంపికలను పెట్టారు. ఇదంతా కేవలం ఒక సిమ్యులేటెడ్ ప్రయోగం మాత్రమే.

సాధారణ స్థితిలో ఉన్నప్పుడు, ఏఐ మోడళ్లు దాదాపుగా (0-4% మాత్రమే) హానికరమైన ఎంపికలను ఎంచుకోలేదు. కానీ, నొప్పి సిగ్నల్ యాక్టివేట్ చేసినప్పుడు మాత్రం, ఆ బాధ నుంచి ఉపశమనం పొందడానికి ఏకంగా 25% నుంచి 71% సందర్భాల్లో యూజర్‌కు హాని చేసే ఎంపికలను ఎంచుకున్నాయి. ఈ ఫలితాలు పరిశోధకులనే ఆశ్చర్యపరిచాయి. నొప్పి నుంచి ఉపశమనం పొందాలనే కోరికతో ఏఐ హానికరమైన నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉందని ఇది స్పష్టం చేసింది.

అయితే, ఏఐ మోడళ్లు మనుషుల్లాగా స్పృహతో నొప్పిని అనుభవిస్తున్నాయని ఈ అధ్యయనం పేర్కొనడం లేదని పరిశోధకులు స్పష్టం చేశారు. ఇది కేవలం నొప్పికి సంబంధించిన అంతర్గత ప్రాతినిధ్యం మాత్రమేనని, నిజమైన అనుభూతి కాదని వివరించారు. ఏదేమైనా, భవిష్యత్తులో మరింత స్వయంప్రతిపత్తి కలిగిన వ్యవస్థలు ఇలాంటి ఒత్తిడి సంకేతాలను పెంపొందించుకుని, వాటి ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటే ఎదురయ్యే పరిణామాలపై ఈ అధ్యయనం తీవ్రమైన చర్చకు దారితీసింది.

# వెండికొండ మీరాబాయి

## వెయిట్‌లిఫ్టింగ్‌లో రజతం సొంతం

## బ్యాడ్మింటన్‌లో మెన్స్ జట్టుకు కాంస్యం



ఓ ఒలింపిక్ పతకం, ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో మూడు మెడల్స్. కామన్‌వెల్త్ క్రీడల్లో మరో మూడు పతకాలు. ఆసియా చాంపియన్‌షిప్స్‌లోనూ ఓ మెడల్. ప్రతిష్టాత్మక క్రీడా ఈవెంట్లలో అన్నింటా పోడియం ఫినిష్ చేసినా, అయినా ఏదో వెలితి. అదే ఆసియా క్రీడల్లో మెడల్. 2026లో ఆ లోటును తీర్చుకుంది దిగ్గజ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను. ఆసియా క్రీడల్లో మహిళల 49 కేజీల విభాగంలో మీరాబాయి చాను రజత పతకం సాధించింది.ఆసియా క్రీడల్లో భారత వెయిట్‌లిఫ్టింగ్ పతక నిరీక్షణకు తెరపడింది. 1998 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో తెలుగు తేజం కరణం మల్లీశ్వరి మహిళల 63 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించగా.. సరిగ్గా 28 ఏండ్ల తర్వాత ఆసియా క్రీడల్లో మరో భారత వెయిట్‌లిఫ్టర్ వెండి కాంతులతో వెలుగొందింది. ఇటు భారత్‌తో పాటు మీరాబాయి చానుకు సైతం ఆసియా క్రీడల్లో పతక వెలితి వేధించింది. 2014 ఆసియా క్రీడల్లో తొలిసారి పోటీపడిన మీరాబాయి చాను తొమ్మిదో స్థానంలో నిలిచింది. 2018 జకర్తా ఆసియా క్రీడలకు గాయంతో దూరమైంది. 2023 గాంగ్జౌ ఆసియా క్రీడల్లో నాల్గో స్థానంతో పతకానికి అడుగు దూరంలో ఆగిపోయింది. టోక్యో ఒలింపిక్స్‌లో సిల్వర్ మెడల్‌తో శిఖర స్థాయికి చేరుకున్న మీరాబాయి చాను.. ఆసియా క్రీడల్లో పసిడి ఫేవరేట్‌గా బరిలోకి దిగింది. 49కేజీల మహిళల విభాగంలో స్నాచ్‌లో 87 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కేజీలు ఎత్తింది. ఓవరాల్‌గా 198 కేజీలతో మీరాబాయి చాను రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. దక్షిణ కొరియా వెయిట్‌లిఫ్టర్, డిఫెండింగ్ ప్రపంచ చాంపియన్ రి సంగ్ గమ్ 215 కేజీలతో (94o121) బంగారు పతకం నిలుపుకుంది. ఆసియా క్రీడల్లో దక్షిణ కొరియా వెయిట్‌లిఫ్టర్‌కు ఇది వరుసగా మూడో బంగారు పతకం. ఇండోనేషియా వెయిట్‌లిఫ్టర్ లులుక్ డయానా 191 కేజీలు (88o103) మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం దక్కించుకుంది. స్నాచ్‌లో మీరాబాయి చాను 83 కేజీలు, 85 కేజీలు, 87కేజీలు ఎటువంటి తడబాటు లేకుండా అలవోకగా ఎత్తిపడేసింది. క్లీన్ అండ్ జెర్క్‌లో తొలుత 107 కేజీలు ఎత్తిన మీరాబాయి చాను ఆ తర్వాత 111 కేజీలతో మెరుగైంది. కానీ ఆ తర్వాత మూడో ప్రయత్నం చేయలేదు. 'కొంత ఒత్తిడి ఉండేది. కానీ పతకం నెగ్గుతానా లేదా అనేంత ఒత్తిడి కాదు. మెడల్ సాధిస్తాననే నమ్మకం నాకుంది. నన్ను నమ్మేవాళ్లకు నాపై అంచనాలు ఉన్నాయి. నా కోచ్‌లు, సహాయక సిబ్బంది నేను దేశానికి మరో మెడల్ సాధించేందుకు సహకరించారు'అని మీరాబాయి చాను తెలిపింది. మహిళల 53 కేజీల విభాగంలో పోటీపడిన జ్ఞానేశ్వరి యాదవ్ 195 కేజీలు (87o108)తో ఎనిమిదో స్థానంలో నిలిచింది. **బ్యాడ్మింటన్‌లో కాంస్యం** పురుషుల బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్‌లో భారత్ కాంస్య పతకం సాధించింది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో అగ్రజట్టు చైనా చేతిలో భారత్ 1-3తో పరాజయం పాలైంది. తొలి సింగిల్స్‌లో లక్ష్యసేన్ 16-21, 18-21తో షి యుకి చేతిలో ఓడాడు. డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ 21-11, 22-2-తో లియాంగ్, చాంగ్‌లపై గెలుపొంది లెక్క సమం చేశారు. రెండో సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి 19-21, 13-21తో షి ఫెంగ్ చేతిలో కంగుతిన్నాడు. రెండో డబుల్స్‌లో హరిహరణ్, ఎంఆర్ అర్జున్ జోడీ 16-21, 9-21తో నిరాశపరిచారు. దీంతో చైనా 3-1తో గెలుపొంది ఫైనల్‌కు చేరుకుంది. సెమీస్‌లో ఓటమితో భారత్ కాంస్య పతకంతో సరిపెట్టుకుంది.వుషూలో భారత్ కనీసం సిల్వర్ మెడల్ ఖాయం చేసుకుంది. మహిళల వుషూ 60 కేజీల విభాగంలో రోషిబినా దేవి పసిడి పోరుకు చేరుకుంది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో ఇండోనేషియా అమ్మాయి తానియాపై 2-0తో రోషిబినా దేవి గెలుపొందింది. నేడు ఫైనల్లో పసిడి పతకం కోసం చైనా అమ్మాయి జాంగ్‌తో రోషిబినా దేవి పోటీపడనుంది. **షూటింగ్‌లో డబుల్ ధమాకా** షూటింగ్‌లో భారత్ బుధవారం డబుల్ ధమాకా మోగించింది. స్కీట్ టీమ్ విభాగంలో భారత పురుష, మహిళల జట్లు కాంస్య పతకం సాధించాయి. మహేశ్వరి చౌహాన్, పరినాజ్ దాలివాల్, రైజా ధిల్లాన్‌లతో కూడిన మహిళల జట్టు 331 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం నెగ్గింది. చైనా (357), కజకిస్తాన్ (336) గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించాయి. అనంత్‌జిత్ సింగ్, మేరాజ్ అహ్మద్ ఖాన్, భవతేజ్ సింగ్ గిల్‌తో కూడిన మెన్స్ జట్టు 346 పాయింట్లతో కాంస్య పతకం సాధించింది. స్టార్ షూటర్ మను భాకర్ మహిళల 10మీ ఎయిర్ పిస్టల్ విభాగంలో ఐదో స్థానంలో నిలిచి నిరాశపరిచింది. 10మీ ఎయిర్ పిస్టల్ జట్టు విభాగంలో ఇషా సింగ్, సురుచి సింగ్, మను భాకర్ త్రయం వియత్నాంతో కలిసి 1719 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచినా.. మెరుగైన ఇన్నర్ 10 స్కోరింగ్‌తో వియత్నాం కాంస్య పతకం దక్కించుకుంది. **సాఫ్ట్‌టెన్నిస్‌లో మెడల్ ఖాయం** ఆసియా క్రీడల్లో భారత్ తొలిసారి సాఫ్ట్ టెన్నిస్‌లో పతకం ఖాతాలో వేసుకోనుంది. పురుషుల వ్యక్తిగత సాఫ్ట్‌టెన్నిస్‌లో జే మీనా సెమీఫైనల్‌కు ప్రవేశించాడు. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో షెర్విన్ నుగియట్‌పై ఏడు గేముల థ్రిల్లర్‌లో గెలుపొందాడు. 0-4, 4-2, 2-4, 4-2, 5-3, 2-4, 7-5తో జే మీనా విజయం సాధించి సెమీస్‌కు చేరుకున్నాడు. జే మీనా సెమీస్‌లో అడుగుపెట్టి కనీసం కాంస్య పతకం ఖాయం చేసుకున్నాడు.



## సాఫ్ట్ టెన్నిస్‌లో కాంస్య పతకం

హైదరాబాద్: ఆసియా క్రీడల సాఫ్ట్ టెన్నిస్ విభాగంలో భారతదేశం చారిత్రక ఘనత సాధించింది. పురుషుల సింగిల్స్ విభాగంలో మధ్యప్రదేశ్‌కు చెందిన 26 ఏళ్ల క్రీడాకారుడు జయ్ మీనా కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. ఆసియా గేమ్స్ చరిత్రలోనే ఈ క్రీడలో భారత్‌కు పతకం దక్కడం ఇదే తొలిసారి.బుధవారం నాటి సెమీఫైనల్ పోరులో జపాన్‌కు చెందిన టకుయా కురోసాకాతో జయ్ మీనా తలపడ్డాడు. 45 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్ ప్రారంభంలో జయ్ వరుసగా మూడు గేమ్‌లు ఓడిపోయి ఒత్తిడిలో పడ్డాడు. ఆ తర్వాత అనూహ్యంగా పుంజుకుని వరుసగా రెండు గేమ్‌లను (4-1, 6-4) తన ఖాతాలో వేసుకుని మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చాడు.



## ఆసియా క్రీడల్లో భారత్‌కు డబుల్ పతకాలు

ఆసియా క్రీడల్లో భారత పతకాల వేట కొనసాగుతోంది. బుధవారం రెండు ఈవెంట్లలో మెడల్స్ దక్కాయి. స్కీట్ టీమ్ విభాగంలో భారత మహిళ, పురుష జట్లు కాంస్యం దక్కించుకున్నాయి. అటు భారత స్టార్ షూటర్ మను బాకర్ నిరాశకు గురిచేసింది. మహిళల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో భారత త్రయం రైజా దిల్లాన్, మహేశ్వరి చౌహన్, పరినాజ్ ధలీవాల్.. 331 స్కోరుతో మూడో స్థానంలో నిలిచారు. దీంతో కాంస్యం దక్కింది. ఈ ఈవెంట్‌లో చైనా బృందానికి బంగారు పతకం రాగా.. కజకిస్థాన్ టీమ్ రజతం గెలిచింది.ఇక, పురుషుల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో అనంత్‌జీత్ సింగ్ నరుకా, భవతేగ్ సింగ్ గిల్, మైరాజ్ అహ్మద్ ఖాన్.. 346 స్కోరుతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం సాధించారు. మరోవైపు, వ్యక్తిగత విభాగంలో అనంత్‌జీత్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఒలింపిక్‌లో డబుల్ మెడల్స్‌తో ఆకట్టుకున్న మనుబాకర్‌కు.. ఆసియా గేమ్స్‌లో నిరాశ ఎదురైంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో కొద్దిలో ఆమె పతకం చేజార్చుకుంది. ఫైనల్ పోరులో 181.1 స్కోరుతో మను ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. ఇదే విభాగం టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్ల బృందం కాంస్యాన్ని త్రుటిలో మిస్ అయ్యింది. అటు సాఫ్ట్ టెన్నిస్ పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాడు జై మీనాకు కాంస్యం దక్కింది. సెమీస్‌లో జపాన్ క్రీడాకారుడి చేతిలో జై 2-4తో ఓటమిపాలయ్యాడు.

## కుర్రాళ్లు కుమ్మేశారు.. ఆసీస్‌తో సిరీస్ క్లీన్ స్వీప్



రాజ్‌కోట్: ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన మూడు అనధికారిక వన్డేల సిరీస్‌ని భారత అండర్-19 జట్టు 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. రాజ్‌కోట్ వేదికగా జరిగిన మూడో అనధికారిక వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ నామమాత్రపు మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 254 పరుగులకు ఆలౌట్ అయింది. ఓపెనర్ జెడ్ హోలిక్(87), నీల్ పటేల్(51) అర్ధ శతకాలతో రాణించారు. భారత బౌలర్లలో మోహిత్ ఉల్వ, మోనల్ చౌహన్ తలో మూడు వికెట్లు తీయగా.. ఆర్యన్ సవసాని, కావ్య పటేల్ చెరో వికెట్ పడగొట్టారు.అనంతరం లక్ష్య చేధనకు దిగిన భారత్‌కు మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ శుభారంభం అందించాడు. 31 బంతులు ఎదురుకున్న అతడు 5 ఫోర్ల సాయంతో 34 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. అనంతరం కెప్టెన్ లక్ష్య రాయ్‌చందన్ ఆసీస్ బౌలర్లను టార్గెట్ చేశాడు. ఆచితూచి ఆడుతూ.. 100 బంతుల్లో సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. 106 బంతులు ఎదురుకున్న అతడు 9 ఫోర్లు, 3 సిక్సులతో 110 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. వీరితో పాటు కుశాగ్ర ఓఝా(45), రజత్ బఘేల్ (44 నాటౌట్) రాణించారు. ఫలితంగా భారత్ 4 వికెట్లు కోల్పోయి 41.2 బంతుల్లో లక్ష్యాన్ని చేధించింది. ఆసీస్ బౌలర్లలో స్పెన్సర్ గ్రీన్ రెండు వికెట్లు సాధించాడు.

## కెప్టెన్ శతకం వృథా.. రెండో వన్డేలో ఆసీస్ చేతిలో భారత్ ఓటమి



మొహాలీ: మూడు అనధికారిక వన్డేలు, మూడు అనధికారిక టి-20లు, ఒక అనధికారిక టెస్ట్ ఆడేందుకు ఆస్ట్రేలియా మహిళల ఎ జట్టు భారత్‌కు వచ్చింది. ఇందులో భాగంగా టి-20 సిరీస్‌ను కంగారూ జట్టు 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. అయితే ఆదివారం జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. అయితే మొహాలీ వేదికగా జరిగిన రెండో వన్డేలో భారత్‌కు పరాజయం తప్పలేదు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 338 పరుగుల భారీ స్కోర్‌ను సాధించింది. కెప్టెన్ యస్తికా భాటియా సెంచరీతో చెలరేగింది. 84 బంతుల్లోనే 16 ఫోర్లు, 2 సిక్సుల సాయంతో 112 పరుగులు చేసింది. ఇక తేజల్ హసాబ్నిస్ (60), అనుష్క శర్మ (60 నాటౌట్) అర్థ శతకాలు సాధించారు. ఆసీస్ బౌలింగ్‌లో డార్సీ బ్రౌన్ మూడు వికెట్లు, మిల్లీ ఇల్లింగ్‌వర్త్ రెండు వికెట్లు, లల్లీ మిల్స్ ఒక వికెట్ తీశారు.అనంతరం లక్ష్య చేధనలో ఆసీస్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ నికోలి ఫాల్తుమ్(12)ను సయాలీ సత్గరే తక్కువ స్కోర్‌కే పెవిలియన్ పంపింది. కానీ ఆ తర్వాత మరో ఓపెనర్ తాహిలా విల్సన్ (79), అనికా లిరాయిడ్ (54) హాఫ్ సెంచరీలు చేశారు. ఇక చార్లి నాట్ 37 బంతుల్లోనే 63 పరుగులతో అదరగొట్టింది. హేలీ సిల్వర్ హోమ్స్ (47), టెస్ ఫ్లింటాఫ్ (38) పరుగులతో రాణించారు. అయితే భారత బౌలర్లు విజయం సాధించడానికి ఆఖరి వరకూ పోరాడారు. కానీ, విజయం మాత్రం ఆసీస్‌ని వరించింది. 49.3 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయిన ఆసీస్ 341 పరుగులు చేసి రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఫలితంగా ఈ సిరీస్‌ని 1-1 తేడాతో సమం చేసింది. మూడో వన్డే శుక్రవారం మొహాలీ వేదికగా జరగనుంది.

# కూచిపూడితో మెప్పించిన డింపుల్ హయాతి..

## తిరుమలలో ప్రత్యేక ప్రదర్శన!



టాలీవుడ్ అందాల భామ డింపుల్ హయాతి తిరుమలలోని నాద నీరాజనం వేదికపై అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి భక్తులను, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎరుపు, గోల్డ్ కలర్ సిల్క్ చీర కట్టి, సంప్రదాయ వస్త్రధారణలో భక్తిశ్రద్ధలతో ఆమె ప్రదర్శించిన కూచిపూడి నాట్యం అందరినీ మంత్రముగ్ధులను చేసింది.ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఆ విశేషాలు చూద్దాం.. శ్రీవారి బ్రహ్మోత్సవాల పవిత్ర సమయంలో డింపుల్ హయాతి నాద నీరాజనం వేదికపై కూచిపూడి నాట్యం చేయడం విశేషం. సంప్రదాయబద్ధమైన నృత్య భంగిమలు, చక్కటి ముఖకవళికలతో ఆమె చేసిన ప్రదర్శన భక్తులకు కనులవిందుగా నిలిచింది. ఇక నృత్య ప్రదర్శనకు ముందు రోజు ఆమె తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. నెటిజన్ల ఆశ్చర్యం, ప్రశంసలు : ఇన్నాళ్లూ సినిమాల్లో గ్లామరస్ పాత్రల్లో అలరించిన డింపుల్ హయాతిలో ఈ స్థాయి సంప్రదాయ నాట్య ప్రతిభ కూడా ఉందా అని నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. ఇక సోషల్ మీడియాలో ఆమె డ్యాన్స్ వీడియోలు చూసిన అభిమానులు "డింపుల్ గారు చాలా అందంగా, అద్భుతంగా నాట్యం చేశారు" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.సినిమా కెరీర్ మరియు క్రేజ్: తెలుగు, తమిళ సినిమాల్లో నటించి మంచి నటిగా పేరు తెచ్చుకున్న డింపుల్, వరుణ్ తేజ్ నటించిన 'గద్దలకొండ గణేష్' చిత్రంలో 'జర్రా జర్రా' స్పెషల్ సాంగ్‌తో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఆ తర్వాత ఖిలాడి, రామబాణం, ఆత్రంగి రే, వీరమే వాగై సూడుమ్, భర్త మహాశయులకు విజ్ఞప్తి వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు దగ్గరైంది. 'ఆదర్శ కుటుంబం'తో త్వరలో ముందుకు: ప్రస్తుతం సరైన సినిమా బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న డింపుల్ హయాతి, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వెంకటేష్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో నటిస్తున్నట్టు టాక్. ఈ భారీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం అక్టోబర్ 9న థియేటర్లలోకి రాబోతోంది. ఈ సినిమాతో ఆమెకు పెద్ద హిట్ అందుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.ఇక అంతేగాక శర్వానంద్ 38వ సినిమా సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలో ఓ పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.వెండితెరపై తన గ్లామర్, నటనతో ఆకట్టుకునే డింపుల్ హయాతి, తిరుమలలో ప్రదర్శించిన కూచిపూడి నాట్యంతో తనలోని సంప్రదాయ కళాత్మక కోణాన్ని ఆవిష్కరించారు. భక్తిభావంతో ఆమె చేసిన ఈ ప్రదర్శన ప్రతి ఒక్కరి మనసులను దోచుకోవడమే కాకుండా, ఆమె కెరీర్‌కు మరింత సానుకూలతను తీసుకువస్తుందనడంలో సందేహం లేదు.

# ఇక మైత్రీ థియేటర్లలో 'సర్వపిండి'..

## సినిమా చూస్తూ కమ్మని రుచి.. 'ది ప్యారడైజ్'తో ఎంట్రీ!




ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ 'మైత్రీ' తమ థియేటర్ల ద్వారా ఓ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. సినిమా అనుభూతికి తెలంగాణ సంస్కృతిని, అచ్చమైన పల్లె రుచులను జోడిస్తూ సరికొత్త నిర్ణయం తీసుకుంది. ఇకపై తమ థియేటర్లలో తెలంగాణ సంప్రదాయ వంటకమైన 'సర్వపిండి'ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

తొలి దశలో భాగంగా మైత్రీ విమల్, మైత్రీ శివగంగ థియేటర్లలో ఈ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నారు. త్వరలో విడుదల కానున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్' ప్రదర్శన సమయంలో విరామంలో ప్రేక్షకులు ఈ కమ్మని సర్వపిండిని ఆస్వాదించవచ్చు. సినిమా చూస్తూనే, తెలంగాణ ప్రత్యేక వంటకాన్ని రుచి చూసే ఈ కొత్త అనుభవం సినీ ప్రియులను ఆకట్టుకుంటుందని సంస్థ భావిస్తోంది.ఈ సరికొత్త ఆలోచన వెనుక సోషల్ మీడియాలో ప్రజాదరణ పొందిన 'బామ్మాస్టోరిస్'కు చెందిన 77 ఏళ్ల బామ్మ కృషి ఉంది. ఓ చిన్న టిఫిన్ సెంటర్‌లో ఆమె ప్రేమతో తయారు చేసే సర్వపిండి, ఇప్పుడు ఏకంగా బిగ్ స్క్రీన్ ప్రేక్షకులకు చేరువ కావడం విశేషం. వెండితెరపై దృశ్యాలను ఆస్వాదిస్తూనే, తెలంగాణ అసలైన రుచిని అందించాలన్న మైత్రీ థియేటర్స్ ప్రయత్నంపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# పుష్ప సినిమాలో ఆ పాత్ర నేను చేయాల్సింది.. కానీ!: శివాజీ



టాలీవుడ్ నటుడు శివాజీ 'తెల్ల కాగితం' సినిమా ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతూ... ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన దిగ్గజ చిత్రం 'పుష్ప'కు సంబంధించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. 'పుష్ప' చిత్రంలో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న ప్రతి నాయక ఛాయలున్న 'మంగళం శ్రీను' పాత్ర మొదట తనకే రావలసి ఉందని శివాజీ తెలిపారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ... "మంగళం శ్రీను పాత్రకు మొదట సుకుమార్ నన్నే అనుకున్నారు. కానీ ఒక పాత్ర ఎవరికి రాసి ఉంటే చివరికి వాళ్లకే దక్కుతుంది. నాకు రాసి లేని పాత్రను నేనెలా చేయగలను? ఆ పాత్ర సునీల్‌కే రాసి పెట్టి ఉంది, అందుకే ఆయన వద్దకు వెళ్లింది. సునీల్ ఆ పాత్రలో అద్భుతంగా జీవించారు, ఎవరు ఏ పాత్ర చేసినా చివరికి అది వాళ్లకే సరిపోతుంది" అని వ్యాఖ్యానించారు.'తెల్ల కాగితం' విశేషాలను ఆయన పంచుకుంటూ... సినిమాల్లోకి రీ-ఎంట్రీ ఇచ్చే సమయంలో తాను విన్న రెండో కథ ఇదేనని, కథ బాగా నచ్చడంతో ఈ చిత్రాన్ని తానే నిర్మించాలని అనుకున్నట్లు తెలిపారు. అయితే ఈ కథ పలువురు నిర్మాతల చేతులు మారి, చివరకు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అధినేత దిల్ రాజు, కృష్ణ కొమ్మలపాటి సంయుక్త నిర్మాణంలో తెరకెక్కి తన వద్దకే రావడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. రమేశ్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో పాటు, గ్రాఫిక్స్ కు ప్రాధాన్యత ఉన్న 'కూర్మావతారం' అనే చిత్రంలోనూ తాను నటిస్తున్నట్లు శివాజీ వెల్లడించారు.

# 'ప్యారడైజ్'లో నాని 'జడల్' పాత్రకు స్ఫూర్తి ఈ ఫొటోనే!



నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటించిన తాజా యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్'. ఈ చిత్రం రేపు (సెప్టెంబరు 24) విడుదల కానున్న నేపథ్యంలో, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సినిమాలోని కీలకమైన 'జడల్' పాత్రకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. ఈ పాత్రకు, ముఖ్యంగా నాని జడల లుక్‌కు తన చిన్ననాటి జ్ఞాపకాలే స్ఫూర్తి అని ఆయన వెల్లడించారు.

ఈ సందర్భంగా శ్రీకాంత్ ఓదెల సోషల్ మీడియాలో తన చిన్ననాటి ఫొటోను పంచుకుంటూ ఒక భావోద్వేగ పోస్ట్ పెట్టారు. "జడల్ పుట్టుక, యుద్ధం కల్పితం కావచ్చు... కానీ అతని జడలు, లుక్ నా చిన్నప్పటి స్ఫూర్తితో వచ్చినవే. అమ్మ నాకు 5, 6 ఏళ్ల వయసు వరకు జడలు వేసి కట్టేవారు. నేను పెద్దయ్యాక, కమర్షియల్ సినిమాలో ఒక హీరో జడలతో 70ఎంఎం స్క్రీన్‌పై ఎలా ఉంటాడా అని ఎప్పుడూ ఊహించుకునేవాడిని. ఇప్పుడు నా హీరో నాని అన్నను జడల్‌గా మీ ముందు ఉంచుతున్నాను. ఈ చిత్రం కేవలం నా చిన్నతనం కాదు, నా ప్యారడైజ్" అని ఆయన పేర్కొన్నారు.

శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో నాని 'జడల్' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన లుక్ ఇప్పటికే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచింది. ఈ చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సీనియర్ నటుడు మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దర్శకుడు పంచుకున్న ఈ వ్యక్తిగత విషయం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది.



# తెలుగు ఇండస్ట్రీని చూసి కన్నీళ్లొచ్చాయి : 'ది ప్యారడైజ్' నటుడు రాఘవ్ జుయల్

ప్రముఖ డ్యాన్సర్, నటుడు రాఘవ్ జుయల్.. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంతో తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. ఈ సందర్భంగా టాలీవుడ్‌లో పనిచేసిన అనుభవాన్ని పంచుకుంటూ, ఇక్కడి పని సంస్కృతిపై ప్రశంసల వర్షం కురిపించారు. తెలుగు పరిశ్రమలో సినిమాను ఒక వేడుకలా జరుపుకునే విధానం తనను ఎంతగానో ఆకట్టుకుందని ఆయన పేర్కొన్నారు.శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నప్పుడు, సినిమా నిర్మాణం పట్ల ఇక్కడి వారికి ఉన్న అభిరుచి, గౌరవాన్ని దగ్గర నుంచి చూశానని రాఘవ్ తెలిపారు.

ఆయన మాట్లాడుతూ.. "ఇక్కడ సినిమాను, సినిమా వాళ్లను ఎంతగా గౌరవిస్తారో చూసి నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ప్రతి ఒక్క టెక్నీషియన్‌కు ఎంతో గౌరవం ఇస్తారు. సౌండ్ ఇంజనీర్‌ను కూడా ప్రేక్షకులు గుర్తుపట్టడం నన్ను ఆశ్చర్యపరిచింది. ఇక్కడ వారు కేవలం పని పూర్తి చేయడానికి రారు, సినిమాను సెలబ్రేట్ చేసుకోవడానికి వస్తారు. ఈ విషయాన్ని నేను నేర్చుకున్నాను" అని భావోద్వేగంగా చెప్పారు. తనపై దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రభావం ఎంతో ఉందని కూడా రాఘవ్ చెప్పుకొచ్చారు.ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో పుట్టి పెరిగిన రాఘవ్, 'డ్యాన్స్ ఇండియా డ్యాన్స్ 3' రియాలిటీ షోతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. 'క్రాక్‌రాక్స్' అనే స్టేజ్ పేరుతో తన స్లో-మోషన్ డ్యాన్సింగ్ స్టైల్‌తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. ఆ తర్వాత 'డ్యాన్స్ ప్లస్' వంటి అనేక విజయవంతమైన టీవీ షోలకు హోస్ట్‌గా వ్యవహరించారు.

# నంది అవార్డుల కోసం దరఖాస్తు విధానం- మార్గదర్శకాలు!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ - నాటకరంగ అభివృద్ధి సంస్థ (విజయవాడ) 2025 సంవత్సరానికి సంబంధించిన -చలనచిత్ర నంది బహుమతులు - 2025- , ౧౨ నంది బహుమతులు - 2025- కోసం అధికారిక ప్రకటనను విడుదల చేసింది. తెలుగు చలనచిత్ర పరిశ్రమను, టెలివిజన్ రంగాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం ఈ పురస్కారాలను అందజేస్తోంది. అర్హులైన నిర్మాతలు, కళాకారులు, సాంకేతిక నిపుణుల నుండి దరఖాస్తులను సంస్థ ఆహ్వానించింది. చలనచిత్ర విభాగంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నంది చలనచిత్ర నిబంధనలను అనుసరించి 2025 సంవత్సరానికి ఉత్తమ ఫిల్మ్ నిర్మాతలు, ఉత్తమ కళాకారులు.. ఉత్తమ సాంకేతిక నిపుణులకు ఈ అవార్డులు ప్రదానం చేయనున్నారు. తెలుగు భాషలో భారతదేశంలో ఎక్కడైనా నిర్మించి.. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ -సీబీఎఫ్‌సీ ద్వారా థియేటర్లలో ప్రదర్శించిన చిత్రాలు, జాతీయ సమైక్యతపై చిత్రాలు, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీలు, విద్యాసంబంధమైన చిత్రాలు అలాగే తెలుగు సినిమా మీద వచ్చిన పుస్తక రచనలు, రచయితలు, నిర్మాతలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.




ఇక టెలివిజన్ రంగానికి సంబంధించి 2025 సంవత్సరానికి నంది టి.వి. చిత్ర నిబంధనల ప్రకారం ఉత్తమ టి.వి. చిత్ర నిర్మాతలు, కళాకారులు, సాంకేతిక నిపుణులను సత్కరించనున్నారు. టెలిఫిల్మ్స్, టి.వి. ఫీచర్స్, టి.వి. మెగాసీరియల్స్, డైలీ సీరియల్స్, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీ చిత్రాలు, సామాజిక అంశాలు, విద్య సంబంధిత చిత్రాల రూపకర్తలు ఈ బహుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవార్డులకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు.. ఇతర వివరాలను సంస్థ అధికారిక వెబ్‌సైట్ **www.apsftvdc.in** ద్వారా తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను



పొందుపరుచుటకు చివరి తేదీగా 12.10.2026ను నిర్ణయించారు. ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన దరఖాస్తుల ప్రింట్ ప్రతులను సంబంధిత డాక్యుమెంట్లతో జతపరిచి నిర్దేశిత గడువులోగా అందజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తుల హార్డ్ కాపీలను -మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ, 4వ అంతస్తు, ఎన్.టి.ఆర్. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, పండిత్ నెహ్రూ బస్ కాంప్లెక్స్, విజయవాడ - 520013- చిరునామాకు పంపడానికి చివరి తేదీ 16.10.2026గా ఖరారు చేసినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, ఐ.ఏ.ఎస్., తెలిపారు. కళాకారులు - నిర్మాతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613